www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

విజయ దశమి శుభాకాంక్షలు

శనివారం | 12-10-2024 | పేజీలు: 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 285 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: నవమి ఉ. 10.59 తదుపరి దశమి; నక్షత్రం: శ్రవణం తె. 4.25 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: ఉ. 9.15 -10.47; దుర్ముహూర్తం: ఉ. 6.11-7.44; అమృతఘడియలు: రా. 6.28-8.00; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.11; సూర్యాస్తమయం: 5.51 | రాజమహేంద్రవరం సిటీ

Rajamahendravaram | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru




శ్రీపీఠంలో దిగ్విజయంగా మహాశక్తి యాగం

సర్పవరం జంక్షన్, అక్టోబరు 11: కాకినాడ రమణయ్యపేటలోని శ్రీపీఠంలో ఐశ్వర్యాంబిక సమేత సుందరేశ్వరస్వామి గోశాల ప్రాంగణంలో తొమ్మిది రోజులుగా స్వామీ పరిపూర్ణానందసరస్వతి ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న మహాశక్తియాగం-2024 మహాక్రతువు చివరి అంకానికి చేరుకుంది. శుక్రవారం తొమ్మిదో రోజు ఐశ్వర్యాంబికా అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవీ రూపంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీసూక్త, మహాలక్ష్మీ హోమం నిర్వహించి ఐశ్వర్య ప్రాప్తి కోసం తులసీ వనస్పతి పూజలు వైభవంగా నిర్వహించారు. శతకోటి కుంకుమార్చన 89 కోట్లకి చేరింది. శనివారం మహాపూర్ణాహుతి, కుంకుమార్చన, అమ్మవారికి అభిషేకం, శాంతికర కల్యాణం జరుగుతాయని స్వామీజీ తెలియజేశారు.

దసరా వచ్చిందమ్మా..



మహిషాసురమర్దినిగా శ్రీ బాలాత్రిపురసుందరి

పోర్టుసిటీ (కాకినాడ), అక్టోబరు 11 : దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా శ్రీ బాలాత్రిపురసుందరి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారు భక్తులకు మహిషాసురమర్దిని అవతారంలో దర్శనమిచ్చారు. శుక్రవారం అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జి, కార్యనిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజు చౌదరి ఏర్పాట్లుచేశారు.

ఆలయాలు ముస్తాబు, మార్కెట్లు రెడీ

రూ.100 కోట్ల వ్యాపారం జరిగే అవకాశం

విజయదశమి పర్వదినానికి ఆలయాలు, మార్కెట్లు ముస్తాబయ్యాయి. జిల్లాలోని ప్రముఖ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, కార్యక్రమాల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. నవరాత్రుల ముగింపు కావడంతో పలుచోట్ల శుక్రవారం ప్రారంభమైన సంబరాలు శనివారం రాత్రి వరకూ కొనసాగనున్నాయి. ఇదే సమయంలో వాహనాలు, గృహోపకరణాలు, ఇతర వస్తువుల కొనుగోలుకు ఇది శుభ సమయంగా పరిగణిస్తారు. ఈ ఒక్కరోజే జిల్లాలో రూ.100 కోట్లకి పైగా లావాదేవీలు జరిగే అవకాశం ఉంది.

పిఠాపురం, అక్టోబరు 11: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దసరా పండుగకు జిల్లా ప్రజలంతా సిద్ధమయ్యారు. శనివారం ఉదయమే అందరూ స్నానాలు ఆచరించి ఆలయాలకు వెళ్లడంతోపాటు ఇంటిలో దేవీపూజ నిర్వహిస్తారు. పలుచోట్ల వాహనపూజలు, ఆయుధ పూజలు జరుగుతాయి. ఇందుకుగానూ జిల్లాలోని ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలోని రాజరాజేశ్వరీదేవి, పదో శక్తి పీఠమైన పురుహూతికాఅమ్మవారు, అన్నవరంలో వనదుర్గాదేవి, తుని సమీపంలో తలుపులమ్మ తల్లి దేవస్థానం, పంచారామాల్లో ఒకటిగా ఉన్న సామర్లకోట కుమార భీమేశ్వరస్వామి దేవస్థానం, కాకినాడ నగరంలోని బాలత్రిపురసుందరి అమ్మవారి ఆలయంతోపాటు జిల్లాలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో ఉన్న కనకదుర్గ, ఇతర అమ్మవార్ల ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్‌దీపాలతో అలంకరించారు. శనివారం ఉదయమే కుంకుమపూజల నిర్వహణకు ఏర్పాట్లుచేస్తున్నారు. పాదగయ పుష్కరిణిలో అమ్మవార్ల తెప్పోత్సవం జరగనున్నది. కాకినాడలో బాలత్రిపురసుందరికి బంగారం చీర అలంకరణ చేయనున్నారు. పలుచోట్ల శుక్రవారం రాత్రి నుంచే దసరా సంబరాలు ప్రారంభమయ్యాయి. వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఇవి శనివారం అర్ధరాత్రి వరకూ కొనసాగుతాయి. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆయా ఆలయ కమిటీలు, దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

మార్కెట్‌లో సందడే సందడి

విజయదశమి పర్వదినాన ప్రజలు వాహనాలు కొనుగోలు చేసేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతారు. స్వంతానికి వినియోగించే ద్విచక్రవాహనాలు, కార్లతోపాటు వాణిజ్య అవసరాలకు వినియోగించే లారీలు, వేన్‌లు, ఆటోలు, బస్సులు ఈరోజునే కొనుగోలు చేయడానికి చాలామంది ఇష్టపడతారు. ఇప్పటికే పలువురు అడ్వాన్సులు లేదా పూర్తి సొమ్ములు చెల్లించి దసరా రోజున డెలివరి చేసేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఇందుకు వారం, పది రోజులు ముందుగానే పలువురు సొమ్ములు చెల్లించడం విశేషం. ఈరోజున వాహనాల కొనుగోలు చేస్తే మంచి జరుగుతుందనే నమ్మకం ఉండడంతో ఏడాది పొడవునా జరిగే కొనుగోళ్లు ఒక ఎత్తయితే దసరా ఒక్క రోజున జరిగే కొనుగోళ్లు ప్రత్యేకం. ఇందుకుగానూ వివిధ కంపెనీలకు చెందిన వాహన షోరూమ్‌లు, డీలర్లు సిద్ధమయ్యారు. శనివారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకూ వాహనాల డెలివరీ కొనసాగుతుంది.

గృహోపకరణాల షోరూంల్లోనూ హడావుడే

దసరా శరన్నవరాత్రులు మొదలైన సమయం నుంచి గృహోపకరణాల షోరూంల్లో సందడి మొదలైంది. దసరా రోజున టీవీలు, ఫ్రిజ్‌లు, ఏసీలు, మిక్సీలు, గ్రైండర్‌లు, ఓవెన్‌లు, కూలర్లు, మొబైల్స్ ఇతర వస్తువులను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలోని కాకినాడ నగరంతోపాటు పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట, తుని, సామర్లకోట, ఏలేశ్వరం సహా వివిధ ప్రాంతాల్లో ఉన్న కార్పొరేట్ చైన్ షాపులతోపాటు సాధారణ దుకాణదారులు భారీగా స్టాకులు తెప్పించి విక్రయానికి సిద్ధంగా ఉంచారు. అదే విధంగా గృహోపకరణాలు, మొబైల్స్ కొనుగోళ్లపై పలు రకాల ఆఫర్లు, డిస్కౌంట్లు, వివిధ బ్యాంకుల డెబిట్, క్రెడిట్ కార్డులపై క్యాష్‌బ్యాక్ ఆఫర్లు, నోకాస్ట్ ఈఎమ్‌ఐలు తదితర ఆఫర్లు ప్రకటించారు. వీటితో లక్కీడ్రాలు కూడా నిర్వహిస్తున్నట్టు విస్తృత ప్రచారం సాగించారు. వినియోగదారులను ఆకట్టుకుని తమ షాపులకు వచ్చేలా దుకాణాల పరిసర ప్రాంతాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఇదే సమయంలో ఆన్‌లైన్‌లోనూ పలు యాప్‌లు, సైట్లు గృహోకరణాలు కొనుగోళ్లపై భారీ డిస్కౌంట్లు, ఆఫర్లు ఇస్తున్నాయి. మరోవైపు బంగారం, వెండి ధరలు గణనీయంగా పెరగడంతో వీటి కొనుగోళ్లపై ప్రజలు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. విజయదశమి ఒక్కరోజునే జిల్లావ్యాప్తంగా వాహనాలు, గృహోపకరణాలు, బంగారం, వెండి, అపార్ట్‌మెంట్లు, విల్లాలు, గృహాలు, స్థలాల క్రయ, విక్రయాల్లో రూ.100-150 కోట్ల వరకూ లావాదేవీలు జరిగే అవకాశముందని మార్కెట్ వర్గాల అంచనా.



వెల్లువెత్తిన మద్యం దరఖాస్తులు

- ముగిసిన దరఖాస్తుల ప్రక్రియ.. 155 మద్యం దుకాణాలకుగాను 3,135 దరఖాస్తులు
- అత్యధికంగా కాకినాడలో 36 దుకాణాలకు 660 దరఖాస్తులు.. నాన్ రిఫండబుల్ డిపాజిట్ రూ.62.70 కోట్లు
- ఈనెల 14వ తేదీన కాకినాడ కలెక్టరేట్‌లో లాటరీ విధానంలో దుకాణాల కేటాయింపు

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు11: జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపు కోసం దరఖాస్తుల స్వీకరణ గడువు శుక్రవారంతో ముగిసింది. మద్యం దుకాణాల కోసం ప్రవాహంలా దరఖాస్తులు వెల్లువెత్తాయి. జిల్లాలో 155 మద్యం దుకాణాలుండగా 3135 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 14వ తేదీన ఉదయం 8 గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లో వివేకానంద హాలులో వీటిని లాటరీ పద్ధతిలో కేటాయించేందుకు అధికారులు సర్వంసిద్ధం చేశారు. జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సమక్షంలో లాటరీ విధానంలో కేటాయింపు జరుగుతుంది. కొత్తగా ప్రవేశపెట్టిన మద్యం పాలసీ ప్రకారం దుకాణాలు కేటాయించేందుకు ఈనెల ఒకటో తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రవేశపెట్టారు. జిల్లాలో ఏడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియ ప్రారంభించారు. మొత్తంగా పదకొండు రోజులపాటు ఈ ప్రక్రియ సాగింది. దుకాణాలను దక్కించుకొనేందుకు పెద్దఎత్తున ప్రైవేటు వ్యక్తులు పోటీపడి దరఖాస్తులు చేసుకున్నారు. ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల నాన్ రిఫండబుల్ డిపాజిట్ చెల్లించారు.

కాకినాడ నగరంలో అత్యధికంగా: జిల్లాలోనే కాకినాడ నగరంలో అత్యధికంగా 36 మద్యం దుకాణాలకుగాను 660 దరఖాస్తులు వచ్చాయి. కాకినాడ నగరంలో మద్యం దుకాణాలకు విపరీతమైన పోటీ నెలకొంది. నగరంలో మద్యంప్రియులు అత్యధిక సంఖ్యలో ఉండడం వల్ల ఏటా కోట్లాది రూపాయల మద్యం అమ్మకాలు జరుగుతుంటాయి. దీంతో ఇక్కడ ఎలాగైనా దుకాణం దక్కించుకోవాలనే ఉద్దేశంతో ప్రైవేటు వ్యాపారులు దరఖాస్తు చేయడానికి ఎగబడ్డారు. అలాగే కాకినాడ రూరల్ మండలంలో 12 దుకాణాలకుగాను 308 దరఖాస్తులు వచ్చాయి. పెదపూడి మండలంలో ఐదు దుకాణాలకు 88 మంది దరఖాస్తు చేశారు. సామర్లకోట మున్సిపాల్టీలో ఐదు దుకాణాలకు 127 దరఖాస్తులొచ్చాయి. సామర్లకోట రూరల్ మండలంలో ఐదు మద్యం దుకాణాలకు 105 మంది దరఖాస్తులు వేశారు.

పిఠాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో : పిఠాపురం మున్సిపాల్టీలో ఐదు మద్యం దుకాణాలకు 117 దరఖాస్తులు వచ్చాయి. అలాగే పిఠాపురం మండలంలో నాలుగు దుకాణాలకు 44 దరఖాస్తులు, గొల్లప్రోలు నగర పంచాయతీలో రెండు దుకాణాలకు 55 దరఖాస్తులు వచ్చాయి. గొల్లప్రోలు మండలంలో మూడు దుకాణాలకు 53 దరఖాస్తులు, యు.కొత్తపల్లి మండలంలో ఐదు దుకాణాలకు 63 మంది దరఖాస్తు చేసుకున్నారు.

తాళ్లరేవు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో : తాళ్లరేవు మండలంలో ఆరు దుకాణాలకు 116 దరఖాస్తులు వచ్చాయి. అలాగే కరప మండలంలో ఆరు దుకాణాలకు 181 దరఖాస్తులు, కాజులూరు మండలంలో ఐదు దుకాణాలకు 129 దరఖాస్తులు లభించాయి.

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో : పెద్దాపురం మున్సిపాల్టీలో ఆరు దుకాణాలకు 114 దరఖాస్తులు వచ్చాయి. అలాగే పెద్దాపురం మండలంలో ఐదు మద్యం దుకాణాలకు 71 దరఖాస్తులు, జగ్గంపేట మండలంలో ఐదు మద్యం దుకాణాలకు 158 దరఖాస్తులు, గండేపల్లి మండలంలో మూడు దుకాణాలకు 52 దరఖాస్తులు వచ్చాయి.

ప్రత్తిపాడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో : ప్రత్తిపాడు మండలంలో మూడు మద్యం దుకాణాలకుగాను 112 దరఖాస్తులు వచ్చాయి. అలాగే కిర్లంపూడి మండలంలో రెండు దుకాణాలకు 50 దరఖాస్తులు, శంఖవరం మండలంలో నాలుగు దుకాణాలకు 95 దరఖాస్తులను స్వీకరించారు. ఏలేశ్వరం నగర పంచాయతీలో మూడు దుకాణాలకు 45 దరఖాస్తులు, ఏలేశ్వరం మండలంలో మూడు దుకాణాలకు 43 దరఖాస్తులు వచ్చాయి.

తుని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో : తుని మున్సిపాల్టీలో ఎనిమిది దుకాణాలకు 96 దరఖాస్తులు వచ్చాయి. అలాగే తుని మండలంలో ఆరు దుకాణాలకు 67 దరఖాస్తులు, తొండంగి మండలంలో నాలుగు దుకాణాలకు 82 దరఖాస్తులు, కోటనందూరు మండలంలో రెండు దుకాణాలకు 47 దరఖాస్తులు వచ్చాయి. రౌతులపూడి మండలంలో రెండు దుకాణాలకు 57 మంది దరఖాస్తు చేసుకున్నారు.

నాన్ రిఫండబుల్ డిపాజిట్ రూ.62.70 కోట్లు

జిల్లాలో 155 మద్యం దుకాణాలకు 3135 దరఖాస్తులు రాగా ఒక్కొక్క దరఖాస్తుకు రూ.2లక్షల చొప్పున నాన్ రిఫండబుల్ డిపాజిట్‌గా రూ.62.70 కోట్లు వచ్చింది. జిల్లాలో పెద్దమొత్తంలో దరఖాస్తులు రావడంతో నాన్ రిఫండబుల్ డిపాజిట్ అత్యధికంగా వచ్చింది.

గుర్తింపు కార్డుతో కలెక్టరేట్‌కు హాజరుకావాలి

ఈనెల 14వ తేదీన కాకినాడ కలెక్టరేట్‌లో వివేకానంద హాలులో లాటరీ విధానం ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు జరుగుతుంది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆరోజు ఉదయం 7 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకోవాలని కాకినాడ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారిణి కృష్ణకుమారి తెలిపారు. హాలులోకి ప్రవేశించేందుకు ఓటరు ఐడీ కార్డుగానీ, డ్రైయింగ్ లైసెన్సుగానీ, పాస్‌పోర్టు, బ్యాంకు పాస్‌బుక్, ఆధార్‌కార్డు వంటి గుర్తింపు కార్డులతో హాజరుకావాలన్నారు. ప్రవేశద్వారం వద్ద గుర్తింపు కార్డులను పరిశీలించిన తర్వాతే హాలులోకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు అనుమతి లభిస్తుందని ఎక్సైజ్ అధికారిణి కృష్ణకుమారి తెలియజేశారు.

సముద్రంలో యువకుని గల్లంతు

తొండంగి, అక్టోబరు11 : సముద్రస్నానానికి వెళ్లిన యువకుడు గల్లంతైన సంఘటన శుక్రవారం తొండంగి మండలం పెరుమాళ్లపురం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఫార్మా కంపెనీలో పనిచేస్తున్న బీహార్‌కు చెందిన యువకులు పెరుమాళ్లపురం తీరంలో సముద్రస్నానం చేస్తుండగా వారిలో వినయ్‌కుమార్‌గుప్త(21) అనే యువకుడు కెరటాల ఉధృతికి గల్లంతయ్యాడు. ఇతనిది చంప్రాన్ జిల్లా జోగియా గ్రామంగా గుర్తించారు. గత ఏడు నెలల నుంచి లైఫస్ ఫార్మా కంపెనీలో ఇతను ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. దీనిపై తొండంగి ఎస్ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.


BLUE HORIZON
విజయదశమి శుభాకాంక్షలతో
18న విడుదల
A PRAVEEN JETTI Film
కల్లు కాంపౌండ్
-1995-
STORY, SCREENPLAY, DIRECTION
PRAVEEN JETTI
Smt HARIKA JETTI, BURRA MALLESH GOUD (BOTTU), Smt PITLA VIJAYA LAKSHMI
DOP ARE SANDEEP MUSIC SAI SRINIVAS EDITING PANDU
DANCE KARIA NANDA MAHESH FIGHTS VIOLENT VELU
SUCHIN CINEMAS LLP


A FILM BY KALYAN CHAKRAVARTHY
దసరా శుభాకాంక్షలు
FROM TEAM REWIND
IN THEATERS OCTOBER 18
రివైండ్
SCREENPLAY, DIALOGUES, PRODUCER & DIRECTOR KALYAN CHAKRAVARTHY
MUSIC ASHIRVAD DOP SHIVARAM CHARAN ACTION DIRECTOR NATRAJ CHOREOGRAPHY RAJ KRISHNA STORY BHARAT CHOUDARY
LYRICS RAVI VARMA AKULA EDITOR THUSHARA PALA SFX ETHIRAJ FINAL MIX RAMA NAIDU STUDIOS DI RAJU REDDY PRO MADHU


DARK HISTORY LEADS TO DEADLY MYSTERY
OCT 18TH RELEASING IN THEATERS
దసరా శుభాకాంక్షలు
వీక్షణం
THE OBSERVER IS OBSERVED
ADITYA MUSIC


SUBISHI ENTERTAINMENTS
ASIAN SURESH ENTERTAINMENT LLP
దసరా శుభాకాంక్షలు
లగ్గం
THE CRAZIEST WEDDING EVER
WRITTEN & DIRECTED BY RAMESH CHEPPALA
PRODUCED BY VENUGOPAL REDDY
WORLDWIDE RELEASE OCTOBER 25 IN THEATERS
MN BAL REDDY
MANISHARMA
CHARAN ARJUN
BONTHALA NAGESWARA REDDY
KRISHNA ARTS
G. KRISHNNA
SRIDHAR
AJAY SIVA SANKAR
VIVAREDDY POSTERS
ADITYA MUSIC


SMT. CHINTA VARALAXMI PRESENTS
K.A. PRODUCTIONS
దసరా శుభాకాంక్షలు
SCAN THE QR CODE TO WATCH TEASER
KIRAN ABBAVARAM
క
క క క క


SVM SRI VEDAKSHARA MOVIES
విజయ దశమి శుభాకాంక్షలు
RANGAPURAM RAGHAVENDRA MURALI KRISHNA CHINTALAPATI PRESENTS
COMING SOON
శ్రీ శ్రీ శ్రీ రాజావారు
WRITTEN & DIRECTED BY VEGESNA SATISH
PRODUCED BY CHINTHAPALLI RAMARAO (BE)


దసరా శుభాకాంక్షలు
హంతకుడు
THE DESTROYER
DR. LAKSHMANA RAO DIGGALA DR. PRAVEEN REDDY


GUNA HANDMADE FILMS
SMT. RAGINI GUNA PRESENTS
EARLY 2025
euphoria
A GUNASEKHAR FILM
SCAN FOR GLIMPSE
దసరా శుభాకాంక్షలు
PRODUCED BY NEELIMA GUNA
KAALA BHAIRAVA PRAVEEN K POTHAN

వంతాడ లేటరైట్ యార్డు పరిశీలన

ప్రత్తిపాడు, అక్టోబరు 11: ప్రత్తిపాడు మండలం వంతాడ లేటరైట్ యార్డును శుక్రవారం పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి పరిశీలించారు.

పిఠాపురంలో బీమా ఏజెంట్ల ఆందోళన

పిఠాపురం, అక్టోబరు 11: పిఠాపురంలోని జీవిత బీమాసంస్థ కార్యాలయంవద్ద శుక్రవారం ఎల్ఐసీ ఏజెంట్ల యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోకారెడ్డి రామకృష్ణ, కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఈనెల నుంచి తీసుకువచ్చిన పాలసీవిధానాలు ఏజెంట్ల మనుగడ దెబ్బతీసేవిగా ఉన్నాయన్నారు. యూనియన్ ప్రతినిధులు రాంబాబు, రామచంద్రరావు పాల్గొన్నారు.

ఏవీ నగరంలో వైభవంగా లక్ష కుంకుమార్చన

తొండంగి, అక్టోబరు 11: శరన్నవరాత్రుల్లో తొమ్మిదో రోజైన శుక్రవారం ఏవీనగరం ఆధ్యాత్మిక శోభతో అలరారింది. శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో మహర్నవమి సందర్భంగా అమ్మవారు మహిషాసురమర్దనిగా భక్తులకు దర్శనమిచ్చారు. తుని ఎమ్మెల్యే యనమల దివ్య, మాజీమంత్రి యనమల రామకృష్ణుడు సతీమణి విజయలక్ష్మి కుంకుమ పూజలో పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదు బాధ్యతగా చేపట్టాలి

డివిజన్ ఇన్‌చార్జిల సమావేశంలో ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, అక్టోబరు 11: పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని కూటమి శ్రేణులు బాధ్యతగా చేపట్టాలని, తద్వారా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. జగన్నాథపురంలోని క్యాంపు కార్యాలయంలో డివిజన్, క్లస్టర్ ఇన్‌చార్జిలతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, గదుల సాయిబాబు, జొన్నాడ వెంకటరమణ, పంతాడి రాజు, రహీమ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో దుకాణంలో అగ్నిప్రమాదం

కాకినాడ క్రైం, అక్టోబరు 11: కాకినాడలోని ఓ షాపులో విద్యుదాఘాతం కారణంగా శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించింది. సంతచెరువు జంక్షన్ సమీపంలోని ఎస్ఆర్‌కే బిల్డింగ్‌లో ఎస్.శివనాగరాజు నిర్వహిస్తున్న మధుసూధన్ ఆటోఫైనాన్స్ షాపు ఉంది. షాపులో ఏసీకి షార్ట్‌సర్క్యూట్ సంభవించడంతో మంటలు చెలరేగి దావానంలా వ్యాపించాయి. స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో ఏడీఎఫ్‌వో వి.సుబ్బారావు తన సిబ్బంది, శకటంతో సంఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

మద్యంషాపులకు 435 దరఖాస్తులు

తాళ్లరేవు, అక్టోబరు 11: తాళ్లరేవు ఎక్సైజ్ పరిధిలో మద్యంషాపులకు 435 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ కోటేశ్వర్ శుక్రవారం తెలిపారు. తాళ్లరేవులో 6షాపులకు 116, కరపలో 6షాపులకు 185, కాజులూరులో 5షాపులకు 134 దరఖాస్తులు వచ్చాన్నారు.

88వ సారి రక్తదానం



కాకినాడ రూరల్, అక్టోబరు 11: కాకినాడ లయన్స్‌క్లబ్ హాల్లో పూర్వపు జిల్లా గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా రక్తదానశిబిరం శుక్రవారం నిర్వహించారు. 100మంది రక్తదానం చేయగా బాదం బాలకృష్ణ 88వసారిరక్తదానం చేశారు. శ్రీనివాస్, కుమార్,మురళీ, జగన్నాథరావు, గాంధీజీ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

సర్పవరం జంక్షన్, అక్టోబరు 11: ఆనంద నిలయం హాస్టల్లో పీడీఎస్‌యూ 50వసంతాల పోస్టర్‌ని హైస్కూల్ హాస్టల్ వార్డెన్ వి.లోవరాజు, మాజీ పీడీఎస్‌యూ నాయకులు, కోనసీమ జిల్లా ఎస్సీఎస్టీ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి నాగబత్తుల శ్రీనివాస్, రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దూ ఆవిష్కరించారు. ప్రసాద్,ఈశ్వర్, కిషోర్, యశ్వంత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల ర్యాలీ

పిఠాపురం, అక్టోబరు 11: పోస్టల్ పథకాలపై అవగాహన కల్పిస్తూ పిఠాపురంలో తపాలాశాఖ ఉద్యోగులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన పోస్టాఫీసు నుంచి పురవీధుల్లో ప్రదర్శన సాగింది. ఐపీబీసీ మేనేజరు కె.రాజకుమార్, ఐపీవో సూర్యప్రకాష్, ఎస్పీఎం ఎస్ఎల్ రెడ్డి పాల్గొన్నారు.



వనదుర్గ ఆలయంలో చండీహోమం

అన్నవరం, అక్టోబరు 11: వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం నిర్వహిం చారు. 11గంటలకు హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు.

మహిషాసురమర్ధిని అవతారంలో అమ్మవారు

పోర్టుసిటీ(కాకినాడ), అక్టోబరు 11: కాకినాడలోని బాలా త్రిపురసుందరి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారు భక్తులకు మహిషాసురమర్ధిని అవతారంలో దర్శనమిచ్చారు. దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జి, ఈవో వుండవల్లి వీర్రాజు చౌదరి ఏర్పాట్లు చేశారు. నగరంలోని అయ్యప్పస్వామి దేవాలయం ఆవరణలోని కామాక్షి అమ్మవారు భక్తులకు బంగారు చీరలో దర్శనమిచ్చారు. భానుగుడి రిజర్వ్ లైన్‌లోని దేవాలయంలో శుక్రవారం నిర్వహించిన కుంకుమ పూజల్లో 200మందికిపైగా మహిళలు పాల్గొన్నారు. ఆలయ పర్సన్ ఇన్‌చార్జి పి.గోపాలకృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చండీ హోమం

కాకినాడ సిటీ, అక్టోబరు 11: కాకినాడ సినిమారోడ్‌లోని సంతచెరువువద్దగల కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం చండీహోమం నిర్వహించారు. హోమంలో 36వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్, తులసి దంపతులు పూజలు చేశారు. ఈవో జోగా సత్యనారాయణ, అమలకంటి బలరామ్, పాల్గొన్నారు.

మహిషాసురమర్ధినిగా రాజరాజేశ్వరీదేవి

పిఠాపురం, అక్టోబరు 11: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రం కుక్కుటేశ్వర స్వామివారి సన్నిధిలో రాజరాజేశ్వరిదేవి, పురుహూతికా అమ్మవార్ల శరన్నవరాత్ర శతచండీయాగ మహోత్సవాల తొమ్మిదోరోజు శుక్రవారం రాజరాజేశ్వరీదేవి మహిషాసురమర్ధిని అలంకారంలో దర్శనమిచ్చారు. మహాగణపతి స్వామికి విఘ్నేశ్వరపూజ, కుక్కుటేశ్వరస్వామి,దత్తాత్రేయస్వామికి అభిషేకాలు, రాజరాజేశ్వరీదేవికి ప్రాతఃకాల విశేష సహస్రనామార్చన, సామూహిక విశేషకుంకుమార్చనలు జరిగాయి. ఆలయ ఈవో, సహాయ కమిషనరు పి.విశ్వనాథరాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గాజులగౌరీగా దర్శనమిచ్చిన లలితాదేవి

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 11: గొల్లప్రోలు మండలం దుర్గాడలోని శివాలయంలో పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి చెంతన కొలువైఉన్న లలితాదేవి శుక్రవారం గాజులగౌరీగా దర్శనమిచ్చారు. అమ్మవారిని గాజులతో అలంకరించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజలు జరిపించగా సేవాసమితి సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. తాటిపర్తిలో అపర్ణాదేవికి రాజరాజేశ్వరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అపర్ణాదేవికి పదివేల చిట్టిగాజులతో అలంకారం చేశారు.

పి.మల్లవరంలో పాలకనకదుర్గమ్మ

తాళ్లరేవు, అక్టోబరు 11: పి.మల్లవరం పంచాయతీ పరిధి గ్రాంటులో పాలకనకదుర్గమ్మ మహిషాసురమర్ధినిగా అవతారమెత్తి భక్తులు ఆశీస్సులు పొందింది. అర్చకులు కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, ధూళిపూడి వెంకటరమణ, రాయుడు సింహాచలం పాల్గొన్నారు.

పెద్దాపురంలో భువనేశ్వరీ అమ్మవారు

పెద్దాపురం, అక్టోబరు 11: పట్టణ, మండల పరిధిలోని గ్రామాల్లో అమ్మవారు మహిషాసురమర్ధినిగా శుక్రవారం దర్శనమిచ్చారు. వడ్లులవారివీధిలోని భువనేశ్వరీపీఠంలో అమ్మవారు మహిషాసురమర్ధిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతి చింతా గోపీశర్మ ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మరిడమ్మ దేవస్థానం, కాండ్రకోట నూకాలమ్మ దేవస్థానాల్లో అమ్మవారిని సుందరంగా అలంకరించారు.

సామర్లకోటలో..

సామర్లకోట, అక్టోబరు 11: సామర్లకోట మండలంలోనూ, పట్టణంలోనూ శుక్రవారం అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. సామర్లకోట భీమేశ్వరాలయంలోని బాలా త్రిపుర సుందరి అమ్మవారికి ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, వెంకన్న, వినయ్, వెంకటరమణ, రాజగోపాలశర్మ తదితరులతో వేదమంత్రోచ్చారణలతో పూజలు నిర్వహించారు. బాలాత్రిపుర సుందరి అమ్మవారిని ఉత్తరాషాఢనక్షత్రంలో శ్రీమహిషాసురమర్దినిగా సర్వాంగసుందరంగా అలంకరించారు. శనివారం దసరా పర్వదినం పురస్కరించుకుని అమ్మవారిని శ్రవణా నక్షత్రంలో రాజరాజేశ్వరిగా 80కిలోల వెండి(రజత) చీరతో అలంకరించనున్నట్లు పండితులు చెరుకూరి రాంబాబు తెలిపారు.




పాదగయలో రాజరాజేశ్వరి సామర్లకోటలో బాలాత్రిపురసుందరి




కొత్తపల్లి మండలం కొమరగిరిలో.. పెద్దాపురంలో భువనేశ్వరీ అమ్మవారు

కొమరగిరిలో బాలకనకదుర్గ

కొత్తపల్లి, అక్టోబరు 11: కొమరగిరిలో బాలకనకదుర్గ శ్రీరాజరాజేశ్వరిదేవి అవతారంలో శుక్రవారం దర్శనమిచ్చారు. రంగు,రంగుల గాజులతో అలంకరించిన రాజేశ్వరీ దేవికి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు.

లోవలో సామూహిక కుంకుమార్చనలు

తుని రూరల్, అక్టోబరు 11: లోవ దేవస్థానంలో మహర్నవమి పర్వదిన వేళ ఆలయంలో మహిషాసురమర్దిని దేవిగా తలుపులమ్మ అమ్మవారు భక్తులను అనుగ్రహించారు.

సీఎం సహాయనిధికి రూ లక్ష విరాళం

కాకినాడ సిటీ, అక్టోబరు 11: వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి కాకినాడ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు రూ.లక్ష విరాళం అందించారు. ఈ మేరకు సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబును శుక్రవారం ఆయన నివాసంలో కలిసిన అసోసియేషన్ ప్రతినిధులు రూ.లక్ష చెక్కును అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు గ్రంధి బాబ్జి, కార్యదర్శి భూస్వామి, గుర్రం సత్యనారాయణ, చందక్ పవన్‌కుమార్, కోటిబాబు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీకి పితృవియోగం

ప్రత్తిపాడు, అక్టోబరు 11: ప్రత్తిపాడు మండల పరిషత్ వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను తండ్రి ఏనుగు వీర రామవులు (60)అనారోగ్యానికి గురై శుక్రవారం రాచపల్లిలోని తమ స్వగృహం వద్ద కన్నుమూశారు.

బ్యాగులో బంగారు వస్తువులు మిస్సింగ్‌పై పోలీసులకు ఫిర్యాదు

గండేపల్లి, అక్టోబరు 11: బ్యాగులో ఉంచిన బంగారు వస్తువులు కనిపించకపోవడంతో శుక్రవారం గండేపల్లి పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్ఐ యువి శివనాగబాబు వివరాల ప్రకారం.. విశాఖపట్నానికి చెందిన మొల్లేటి సుగుణ తన ఇద్దరు పిల్లలతో కలిసి ఏలేశ్వరం తన అక్క ఇంటి నుంచి యర్రవరం వచ్చి సెంటర్‌లో ఆ టో ఎక్కింది. అక్కడి నుంచి ఆమె పుట్టిల్లు మురారి గ్రామం వచ్చి ఇంటికివెళ్లారు. సాయంత్రం ఆమెతో పాటు తెచ్చుకున్న బ్యాగు తెరిచి చూడగా బంగారపు పాపిడిబొట్టు, హారం, నక్లెస్ పెట్టిన బాక్సు కనిపించలేదు. ఎంత వెతికిన దొరకపోవడంతో గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ కేసు నమోదు చేశారు.

ఘనంగా బోనాల ఊరేగింపు

ఏలేశ్వరం, అక్టోబరు 11: భద్రవరం గ్రామంలో దేవి నవరాత్రి ఉత్సవాల్లో శుక్రవారం మహిళలు బోనాలు పండుగ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి చేశారు. పలు వీధుల్లో బోనాలతో మహిళలు ఊరేంపు నిర్వహించి దుర్గమ్మకు మొక్కులు చెల్లించి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీ పీ గొల్లపల్లి బుజ్జి, జిగటాపు సూరిబాబు, కొప్పుల బాబ్జి ఉన్నారు.

విజయవాడకు భవానీ భక్తుల పయనం

ప్రత్తిపాడు, అక్టోబరు 11: మండలంలోని భవానీ మాలధారణ భక్తులు శుక్రవారం మొక్కులు చెల్లించుకునేందుకు విజయవాడ బయల్దేరారు. ధర్మవరం, ప్రత్తిపాడు, ఉత్తరకంచి, ఒమ్మంగి ఆలయాల వద్ద భక్తులు మండల దీక్షలు ముగించుకుని పలు వాహనాల్లో విజయవాడ కనకదుర్గ అమ్మవారి మొక్కులు తీర్చుకునేందుకు బయల్దేరారు. ఉత్తరకంచి ఆలయం మహిషాసురమర్దిని అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని 130 మంది భవానీలు దర్శించుకున్నారు.

కాకినాడ

పిడుగులతో భారీ వర్షం

సామర్లకోట, అక్టోబరు 11: సామర్లకోట మండలంలోను, పట్టణంలోను శుక్రవారం తెల్లవారుజామున భీకరశబ్దాలతో కూడిన పిడుగులు, భారీవర్షంతో ప్రజలు భయాందోళనలు చెందారు. ఉరుములు, మెరుపులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పిడుగుల కారణంగా పలు ప్రాంతాల్లో కిటీకీ అద్దాలు నేలరాలాయి. ఇళ్లల్లో సీలింగ్‌లు బీటలు తీశాయి.

మహిషాసురమర్దినిగా రత్నగిరి దుర్గలు

అన్నవరం, అక్టోబరు 11: రత్నగిరి దుర్గలుగా పూజలందుకుంటున్న వనదుర్గ, కనకదుర్గలు మహిషాసుర మర్ధినిగా భక్తులను అనుగ్రహించారు.

ఆటోను ఢీకొన్న కారు

ఐదుగురికి గాయాలు

గండేపల్లి, అక్టోబరు 11: మండలంలో మురారి గ్రామ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. పోలీసుల సమాచారం ప్రకారం.. భీమవరం నుంచి అన్నవరం ఆటోలో వెళ్లి తిరిగి వస్తుండగా మురారి వచ్చేసరికి అదేమార్గంలో వైజాగ్ వైపు నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న కారు ఆటోను బలంగా ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ ఎం.వీరబాబు, సత్యవతికి బలమైన గాయాలు కాగా జయలక్ష్మి, మరిడమ్మ, హారికకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ శివనాగబాబు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.





ప్రమాదంలో నుజ్జునుజ్జైన ఆటో, క్షతగాత్రులకు ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

'కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

ప్రత్తిపాడు, అక్టోబరు 11: లంపకలోవలోని వీరభద్ర ఎక్స్‌పోర్ట్స్ రొయ్యల పరిశ్రమ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన నిరసన రెండో శుక్రవారం కొనసాగింది. కార్మికుల ఆందోళనకు సీఐటీయూ నాయకులు రొంగల ఈశ్వరరావు మద్దతు తెలిపి వారి న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మల్లేపల్లిలో కుంకుమ పూజలు

గండేపల్లి, అక్టోబరు 11: మల్లేపల్లి జాతీయ రహదారి పక్కన ఇనకోటి వెంకటేశ్వరరావు స్థలంలో నూతనంగా నిర్మించిన శ్రీవిజయకనకదుర్గ ఆలయం వద్ద శుక్రవారం పురోహితులు చింతా అరుణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దొమ్మా శ్రీను, వెలిది సుబ్రహ్మణ్యం, అడబాల గంగారావు, పడాల శ్రీను, ఉండమంట్ల వెంకటేశ్వరరావు, శ్రీను, త్రిమూర్తులు, ఇనకోటి బాస్కరరావు, నరవ శ్రీను, వెలిది వెంకటరాజు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం: ఎమ్మెల్యే

ప్రత్తిపాడు, అక్టోబరు 11: ఆధ్యాత్మిక చింతన ప్రతి ఒక్కరికీ అవసరమని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. శుక్రవారం స్థానిక చెక్‌పోస్టు సెంటర్‌లోని కనకదుర్గ ఆలయాన్ని సందర్శించి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొని వడ్డించారు. ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొమ్ముల కన్నబాబు, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు. రౌతుపాలెం గ్రామంలో బోనాల పండుగ నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు పాల్గొని ప్రసాద వడ్డన చేశారు. వరుపుల సాయికిరణ్, పెదిరెడ్ల రాజీవ్, దాసరి రాంబాబు, గుండం సత్తిబాబు, ఉపసర్పంచ్ కె.బాబ్జి, నాని, గణేశుల దొరబాబు పాల్గొన్నారు.

రామవరంలో అన్న సంతర్పణ

జగ్గంపేట, అక్టోబరు 11: జగ్గంపేట మండలం రామవరం గ్రామంలో కనకదుర్గ ఆలయం వద్ద అన్న సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమానికి జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. రామవరం ఎంపీటీసీ దొడ్డ శ్రీను, మొగిలి గంగాధర్, మండపాక బాపన్నదొర, వేణుగోపాల్, గోకేడ ప్రసాద్, కాయల మణికంఠ, రేపూరి శ్రీనివాస్, బచ్చల రాజు, గోకేడ రమణ, కొలిమల్ల అదియ్యా, బుజ్జి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఉప్పలపాడు పంచాయతీ నిధుల అవకతవకలపై చర్యలు తీసుకోండి'

గండేపల్లి, అక్టోబరు 11: మండలంలో ఉప్పలపాడు గ్రామ పంచాయతీ నిధుల అవకతవకలపై చర్యలు తీసుకోవాలని జనసేన, టీడీపీ నాయకులు కోరారు. దీనిపై శుక్రవారం ఉప్పలపాడులో జనసేన నేతలు మేడిబోయిన శ్రీను, సత్తి సోమరాజు విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ హయాంలో గెలిచిన ఉప్పలపాడు పంచాయతీ సర్పంచ్ గ్రామంలో ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారన్నారు. ముఖ్యంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మించి దాన్ని పశువుల పాకగా ఉపయోగిస్తున్నారన్నారు. గ్రామ పంచాయతీ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి సంబంధించి రూ.18లక్షలు, ఉపాధి హామీలో పనుల్లో రూ.10లక్షలు, జలజీవన్ మిషన్ పేరిట కుళాయి కనెక్షన్లు ద్వారా రూ.64లక్షలు నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపించారు. బిల్లులు పెట్టుకుని ప్రభుత్వ సొమ్ము స్వాహా చేశారని గ్రామంలో ఏ అభివృద్ధి చేయలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి దుర్వినియోగమైన నిధులు రికవరీ చేసి దీనికి కారకులైన సర్పంచ్, వారికి సాయపడిన క్షేత్రస్థాయి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకుడు అడబాల సత్యనారాయణమూర్తి, జిల్లా మాలమహానాడు సెక్రటరీ నూకతట్టు రమణ, వార్డు మెంబర్లు తలాటం సూరిబాబు, కక్కుల రాజు, అంకం ఓంకృష్ణ, దూది శ్రీను ఉన్నారు.

సోమాలమ్మకు ప్రత్యేక పూజలు

జగ్గంపేట, అక్టోబరు 11: స్థానిక రాజమండ్రి రోడ్‌లో సోమాలమ్మ అమ్మవారి ఆలయంలో ఓ రుచి హోటల్స్ అధినేత నాగేంద్ర చౌదరి సత్యభారతి దంపతులు శుక్రవారం అమ్మవారికి పంచామృత అభిషేకం హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు మహిషాసురమర్దిని అవతారంలో దర్శనమిచ్చారు. గత పదిరోజులగా భవానీలు, అయ్యప్ప భక్తులు నడిచి వెళ్లే వారందరికీ మోహన్‌కృష్ణా రెసిడెన్సీలో ఉచిత వసతి భోజనం ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు నాగేంద్ర చౌదరి కుటుంబ సభ్యులు నవదీన్ వెంకట సాయి, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయాల్లో ఎమ్మెల్యే చినరాజప్ప, కూటమి నేతల పూజలు

సామర్లకోట, అక్టోబరు 11: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు పురస్కరించుకుని సామర్లకోట పట్టణంలో పలు అమ్మవార్ల ఆలయాలను శుక్రవారం రాత్రి పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మలబాబు కలిసి కూటమి నాయకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయోధ్య రామపురం సత్తెమ్మ ఆలయంలో ఉత్సవ కమిటీ ప్రతిని ధులు పోలినాటి సూర్యప్రకాష్, చీమలకొండ వీరభద్ర ప్రసాద్ ఆధ్వర్యంలోవారికి స్వాగతం పలికారు. సామర్లకోట మండలం వేట్లపాలెం కెనాల్ రోడ్డులో దుర్గాదేవి ఆలయం వద్ద దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు పురస్కరించుకుని శుక్రవారం కమిటీ ప్రతినిధులు ఏర్పాటు చేసిన మహాన్నదానాన్ని ఎమ్మెల్యే చినరాజప్ప వడ్డించి ప్రారంభించి భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. టీడీపీ నాయకులు గుమ్మళ్ల రామకృష్ణ, వెంకన్న ఆలయ వ్యవస్థాపకులు పెండ్యాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



కూటమి నేతలతో చినరాజప్ప

'గ్రామీణ ప్రాంత రహదారులకు మహర్దశ'

సామర్లకోట, అక్టోబరు 11: చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం రోడ్ల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే చినరాజప్ప అన్నారు. సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం చినరాజప్ప కాలనీలో రూ.60 లక్షలతో 935 మీటర్ల పొడవునా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శ్రీకారం చుట్టారు. టీడీపీ మండల అధ్యక్షుడు తోటకూర శ్రీనివాస్, గుమ్మళ్ల రామకృష్ణ, సర్పంచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

బిజినెస్

రాజమహేంద్రవరం ● శనివారం 12 అక్టోబరు 2024

రతన్ టాటా వారసుడిగా నోయల్ టాటా

టాటా ట్రస్ట్స్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎంపిక

- వెంటనే అమల్లోకి వచ్చిన నియామకం
- రతన్ టాటా సవతి సోదరుడే నోయల్
- నలభై ఏళ్లకుపైగా టాటా గ్రూప్‌తో అనుబంధం



ముంబై: టాటా గ్రూప్‌లో వారసత్వ పగ్గాల బదిలీ ప్రశాంతంగా జరుగుతోంది. టాటా ట్రస్ట్స్ కొత్త చైర్మన్‌గా రతన్ టాటా సవతి సోదరుడు నోయల్ టాటా (67) నియమితులయ్యారు. ముంబైలో శుక్రవారం జరిగిన టాటా ట్రస్ట్స్ ట్రస్టీల సమావేశం ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ ట్రస్టులకు టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్ ఈక్విటీలో 66 శాతం వాటా ఉంది. దాదాపు ఈ ట్రస్టులన్నిటిలో నోయల్ టాటా ఇప్పటికే ట్రస్టీగా ఉన్నారు. కొత్త చైర్మన్‌గా నోయల్ టాటా నియామకం వెంటనే అమల్లోకి వస్తుందని టాటా ట్రస్ట్స్ ఒక ప్రకటనలో తెలిపింది. 'రతన్ టాటా, టాటా గ్రూప్ వ్యవస్థాపకుల వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు ఎదురు చూస్తున్నా' అంటూ ఈ ప్రకటన వెలువడిన వెంటనే నోయల్ టాటా ట్వీట్ చేశారు.

2012లోనే తెరపైకి పేరు

ప్రచారానికి దూరంగా ఉండే నోయల్ టాటా పేరు నిజానికి 2012లోనే రతన్ టాటా తర్వాత టాటా గ్రూప్ చైర్మన్‌గా తెరపైకి వచ్చింది. అయితే అప్పట్లో ఆయన తన బావమరిది సైరస్ మిస్త్రీకి ఈ పదవి కట్టబెట్టేందుకు వీలుగా ఆ పదవిపై పెద్దగా ఆసక్తి చూపలేదంటారు. ఇప్పుడు రతన్ టాటా, సైరస్ మిస్త్రీ ఇద్దరూ లేకపోవడంతో ఇక టాటా గ్రూప్ సారథ్యం స్వీకరించేందుకు నోయల్ టాటా కాదనలేదని సమాచారం.

టాటాల మనిషే

రతన్ టాటా సవతి సోదరుడైన నోయల్ టాటాకు.. టాటా గ్రూప్‌తో నలభై ఏళ్లకుపైగా అనుబంధం ఉంది. టాటా గ్రూప్ రిటైల్ కంపెనీ 'ట్రెంట్' బహుముఖ విస్తరణలో నోయల్ టాటాది కీలక పాత్ర. 1998లో ఒక స్టోర్‌తో ప్రారంభించి వివిధ ఫార్మాట్లలో ఆ సంస్థను 700కుపైగా స్టోర్లకు విస్తరించారు. వెస్ట్‌సైడ్, జుడియో, క్రోమాతో పాటు ఇటీవల టాటాల గూటికి చేరిన బిగ్ బాస్కెట్ వంటి కంపెనీలన్నీ ట్రెంట్ గొడుకు కిందే పనిచేస్తాయి. లిస్టెడ్ కంపెనీ అయిన ట్రెంట్ ప్రస్తుత మార్కెట్ క్యాప్ రూ.1.81 లక్షల కోట్ల వరకు ఉంది. ఇదిగాక టాటా గ్రూప్ కంపెనీలైన వోల్టాస్, టాటా ఇంటర్నేషనల్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ వంటి అనేక టాటా గ్రూప్ కంపెనీలకూ నోయల్ చైర్మన్‌గా ఉన్నారు. వీటికి తోడు టాటా స్టీల్, టైటాన్ కంపెనీలకు వైస్ చైర్మన్‌గానూ నోయల్ టాటా వ్యవహరిస్తున్నారు.

కుటుంబ నేపథ్యం

నావెల్ హెచ్ టాటా.. నోయల్ టాటా తండ్రి. తల్లి సిమోన్ హెచ్ టాటా స్విట్జర్లాండ్‌కు చెందిన వ్యాపారవేత్త. సిమోన్ హెచ్ టాటా కంటే ముందే నావెల్ హెచ్ టాటా రతన్ టాటా తల్లి సూనూ కమిశారియట్‌ను వివాహం చేసుకున్నారు. ఆ పెళ్లి ద్వారా నావెల్ హెచ్ టాటాకు రతన్, జిమ్మీ జన్మించారు. ఈ ముగ్గురు అన్నదమ్ముల్లో నోయల్ టాటా మాత్రమే వివాహితుడు. రతన్ టాటా, జిమ్మీ టాటా అవివాహితులు. నోయల్ టాటా భార్య ఆలూ మిస్త్రీ.. రతన్ టాటా తర్వాత టాటా గ్రూప్ పగ్గాలు చేపట్టిన సైరస్ మిస్త్రీకి స్వయానా సోదరి. షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ అధినేత పల్లోంజీ మిస్త్రీ కుమార్తె.

షాపూర్జీ పల్లోంజీ కుటుంబానికి టాటా సన్స్‌లో 18.4 శాతం వాటా ఉన్న సంగతి తెలిసిందే. అంతేకాదు టాటా సన్స్‌లో షాపూర్జీ పల్లోంజీ కుటుంబం అతిపెద్ద ప్రైవేట్ వాటాదారుగా ఉంది. నోయల్ టాటా-ఆలూ మిస్త్రీ దంపతులకు లీ, మాయ అనే కుమార్తెలతో పాటు నెవిల్లే అనే ఒక కుమారుడు ఉన్నారు. ఇందులో లీ టాటా.. ప్రస్తుతం తాజ్ హోటల్స్‌ను నిర్వహించే ది ఇండియన్ హోటల్స్ వైస్ ప్రెసిడెంట్‌గా, మాయా టాటా క్యాపిటల్ కంపెనీలో ఉన్నత స్థానాల్లో పని చేస్తున్నారు. కుమారుడు నెవిల్లే కూడా ట్రెంట్, స్టార్ బజార్ సారథ్య బాధ్యతలు చూసుకుంటున్నారు.

ఆదాయ పన్ను వసూళ్లలో 18 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: ఆదాయ పన్ను (ఐటీ) నికర వసూళ్లు అక్టోబరు 10వ తేదీ నాటికి 18.3 శాతం పెరిగి రూ.11.25 లక్షల కోట్లకు చేరాయి. అందులో వ్యక్తిగత ఐటీ వసూళ్లు రూ.5.98 లక్షల కోట్లు కాగా కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ.4.94 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇవికాకుండా సెక్యూరిటీ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) రూపంలో రూ.30,630 కోట్లు, ఇతర పన్నులు రూ.2150 కోట్లు ఉన్నాయి. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన పన్ను వసూలు మొత్తం రూ.9.51 లక్షల కోట్లు. కాగా ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అక్టోబరు 10వ తేదీ మధ్య కాలంలో పన్ను రిఫండ్స్ మొత్తం రూ.2.31 లక్షల కోట్లుంది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఇది 46 శాతం అధికం. స్థూల ప్రాతిపదికన ప్రత్యక్ష పన్ను వసూళ్లు 22.3 శాతం పెరిగి రూ.13.57 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఇందులో వ్యక్తిగత ఐటీ వసూలు రూ.7.13 లక్షల కోట్లు కాగా కార్పొరేట్ పన్ను వసూలు రూ.6.11 లక్షల కోట్లుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్నుల రూపంలో మొత్తం రూ.22.07 లక్షల కోట్లు వసూలు చేయాలన్నది ప్రభుత్వం బడ్జెట్లో నిర్దేశించిన లక్ష్యం.

తగ్గిన ఫారెక్స్ నిల్వలు

న్యూఢిల్లీ: విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు అక్టోబరు 4తో ముగిసిన వారంలో 370.9 కోట్ల డాలర్ల మేరకు తగ్గి 70,117.60 వద్ద స్థిరపడ్డాయని ఆర్‌బీఐ గణాంకాలు వెల్లడించాయి. అంతకు ముందు వారంలో ఇవి చారిత్రక గరిష్ఠ స్థాయి 70,488.50 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. ఇదే వారంలో బంగారం నిల్వలు 4 కోట్ల డాలర్ల మేరకు దిగజారి 6,575.6 కోట్ల డాలర్ల వద్ద స్థిరపడ్డాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,400 ▲	70,950 ▲	1,02,000 ▲
ముంబై	75,623 ▲	69,271 ▲	89,963 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

12వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	525
వరంగల్	512	గోదావరి	525
చిత్తూరు	538	విశాఖపట్నం	525
		దజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	114	విజయవాడ	125
వరంగల్	114	గుంటూరు	125
కరీంనగర్	114	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	126
కర్నూలు	114	నెల్లూరు	126
విశాఖపట్నం	120	అనంతపురం	126
గోదావరి	125		

పారిశ్రామికం నేలచూపు

న్యూఢిల్లీ: సుమారు రెండు సంవత్సరాల అనంతరం దేశంలో పారిశ్రామికోత్పత్తి ఆగస్టు నెలలో తొలిసారిగా ప్రతికూల వృద్ధిలో ప్రవేశించింది. మైనింగ్, విద్యుదుత్పత్తి రంగాల ఉత్పత్తి క్షీణత కారణంగా పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) గత ఏడాది ఆగస్టుతో పోల్చితే మైనస్ 0.1 శాతానికి దిగజారింది. జూలై నెల పారిశ్రామికోత్పత్తి వృద్ధి రేటును కూడా 4.8 శాతం నుంచి 4.7 శాతానికి కుదించారు. గత ఏడాది ఆగస్టులో ఐఐపీ వృద్ధి రేటు 10.9 శాతం ఉండగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-ఆగస్టు నెలల మధ్య కాలంలో ఐఐపీ వృద్ధి రేటు 4.2 శాతానికి పరిమితమైంది. గత ఏడాది ఇదే కాలంలో ఇది 6.2 శాతంగా ఉంది. ఈ ఆగస్టులో మైనింగ్ రంగం మైనస్ 4.3 శాతం, తయారీ రంగం 0.1 శాతం, విద్యుత్ రంగం మైనస్ 3.7 శాతం వృద్ధిని నమోదు చేశాయి. 2022 అక్టోబరులో నమోదైన 4.1 శాతం ప్రతికూల వృద్ధి తర్వాత ఐఐపీ నెగిటివ్ జోన్‌లోకి రావడం ఇదే ప్రథమం.

అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లో మార్కెట్

ముంబై: పారిశ్రామికోత్పత్తి గణాంకాలు వెలువడడానికి ముందు ఇన్వెస్టర్లలో నెలకొన్న అప్రమత్తత, అమ్మకాల ఒత్తిడి ప్రభావంతో శుక్రవారం స్టాక్ మార్కెట్ నష్టాల్లో ముగిసింది. కొద్ది రోజులుగా విదేశీ నిధులు తరలిపోతూ ఉండడం, రూపాయి బలహీనత, ప్రపంచ భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇన్వెస్టర్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. బ్యాంకింగ్, యుటిలిటీ, ఫైనాన్షియల్ విభాగాల షేర్లలో ఇన్వెస్టర్లు అమ్మకాలు సాగించారు. అయితే మెటల్ విభాగం షేర్లలో జోరుగా కొనుగోళ్లు సాగడంతో నష్టాలు కొంత మేరకు పరిమితం అయ్యాయి. మొత్తం మీద ఆటుపోట్లతో సాగిన పయనంలో సెన్సెక్స్ 230.05 పాయింట్ల నష్టంతో 81381.36 వద్ద ముగియగా నిఫ్టీ 34.20 పాయింట్ల నష్టంతో 24,964.25 వద్ద ముగిసింది. మార్కెట్‌ను ఉత్తేజపరిచే వార్తలేవీ లేకపోవడం వల్ల ట్రేడింగ్ పూర్తిగా సైడ్‌వేస్ ధోరణిలో సాగిందని విశ్లేషకులంటున్నారు.

ట్రాఫిక్‌సోల్ ఐటీఎస్ టెక్నాలజీస్‌పై సెబీ దర్యాప్తు: ఎస్ఎంఈ విభాగంలోని ట్రాఫిక్‌సోల్ ఐటీఎస్ టెక్నాలజీస్ షేర్ల లిస్టింగ్‌ను నిలిపివేయాలని బీఎస్ఈని సెబీ ఆదేశించింది. ఐపీఓకు అనుమతి కోరుతూ సమర్పించిన దరఖాస్తులో సంస్థ చేసినట్టు చెబుతున్న తప్పుడు ప్రకటనలపై సవివరమైన దర్యాప్తు చేపట్టాలని సెబీ నిర్ణయించింది. ఈ దర్యాప్తు 30 రోజుల వ్యవధిలో పూర్తి చేయాలని సెబీ గడువు పెట్టింది. ఆ సంస్థ ఐపీఓ ద్వారా సేకరించిన సొమ్మును వడ్డీ ఆర్జించే ఎస్క్రో ఖాతాలో భద్రపరచాలని బీఎస్ఈకి సూచించింది. ఎస్ఎంఈ వేదిక ద్వారా కంపెనీ షేర్ల లిస్టింగ్‌ను బీఎస్ఈ వాయిదా వేసిన 30 రోజుల అనంతరం సెబీ నుంచి ఈ ఆదేశాలు వెలువడ్డాయి. రూ.66-70 ధరల శ్రేణిలో జారీ అయిన ఈ ఐపీఓకి 345 రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్ లభించింది. రూ.45 కోట్లు వసూలు చేయాలన్నది లక్ష్యం కాగా రూ.10,000 కోట్లకు పైబడిన బిడ్లు దాఖలయ్యాయి.

- బర్నర్స్ తయారీ కంపెనీ మయూఖ్ డీల్ ట్రేడ్ లిమిటెడ్.. రైట్స్ ఇష్యూ ద్వారా రూ.49 కోట్లు సమీకరించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు కంపెనీ బోర్డు ఆమోదం లభించిందని తెలిపింది. అలాగే రూ.5 ముఖ విలువతో కూడిన ప్రతి షేరును రూ.1 ముఖ విలువతో కూడిన ఐదు షేర్లుగా విభజించేందుకు కూడా బోర్డు ఆమోదం లభించిందని వెల్లడించింది.

ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపాయి

ముంబై: ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం రేటు రోజురోజుకీ కుదేలవుతోంది. శుక్రవారం మరో 12 పైసలు నష్టపోయి రూ.84.10 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం రేటు ఇంత కనిష్ఠ స్థాయికి పడిపోవడం ఇదే మొదటిసారి. శుక్రవారం ఉదయం గురువారంతో పోలిస్తే ఒక పైసా నష్టంతో రూ.83.97 వద్ద కొద్దిగా మెరుగ్గానే ప్రారంభమైనా ఇంట్రాడేలో రూ.83.96-84.10 మధ్య ట్రేడైంది. చివరికి గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.84.10 వద్ద ముగిసింది. స్టాక్ మార్కెట్లో కొనసాగుతున్న ఎఫ్‌పీఐల అమ్మకాలు, పశ్చిమాసియా ఉద్రిక్తతలతో మండుతున్న చమురు ధర ఇందుకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.

టయోటా కిర్లోస్కర్ కొత్త అర్బన్ క్రూయిజర్ హైరైడర్



బెంగళూరు: టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) మార్కెట్లోకి ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్ అర్బన్ క్రూయిజర్ హైరైడర్‌ను విడుదల చేసింది. ప్రీమియం యాక్సెసరీస్ ప్యాకేజీ, స్మార్ట్‌నెస్, మరింత కంఫర్ట్‌తో దీన్ని తీసుకువచ్చింది. జీ, వీ వేరియంట్స్‌తో హైబ్రిడ్, నియో డ్రైవ్ పవర్‌ట్రెయిన్స్‌తో ఇది అందుబాటులో ఉండనుంది. దేశవ్యాప్తంగా ఉన్న టయోటా డీలర్‌షిప్ కేంద్రాల్లో సమగ్ర ప్యాకేజీతో ఈ అర్బన్ క్రూయిజర్ అందుబాటులో ఉంటుందని టీకేఎం వెల్లడించింది.

- జేఎం ఫైనాన్షియల్ హోమ్ లోన్స్ లిమిటెడ్ (జేఎంఎఫ్‌హెచ్‌ఎల్‌ఎల్).. ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలను మరింతగా విస్తరించింది. ఇందులో భాగంగా ఏలూరులో కంపెనీ కొత్త శాఖను ప్రారంభించింది. జేఎంఎఫ్‌హెచ్‌ఎల్‌ఎల్‌కు రాష్ట్రంలో ఇది 10వ శాఖ. ఈ కొత్త శాఖ ఏర్పాటుతో దేశవ్యాప్తంగా మొత్తం బ్రాంచీల సంఖ్య 126కి చేరింది.
- ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన సంస్థ అల్ట్రావయొలెట్.. ఆంధ్రప్రదేశ్ మార్కెట్లోకి అడుగుపెట్టింది. ఇందులో భాగంగా విశాఖపట్నంలో తొలి యూవీ స్పేస్ స్టేషన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. ఈ సెంటర్‌లో 10.3 కిలోవాట్ ఎస్ఆర్‌బీ7 లిథియం అయాన్ బ్యాటరీతో కూడిన ఎఫ్77 మార్క్ 2 ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ అందుబాటులో ఉంటాయి.
- ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ కంపెనీ వారివో మోటార్ ఇండియా.. బ్యాటరీ స్మార్ట్‌తో జట్టు కట్టింది. ఒప్పందంలో భాగంగా బీ2బీ ఎలక్ట్రిక్ మొబిలిటీ కోసం బ్యాటరీ స్వాపింగ్ టెక్నాలజీని బ్యాటరీ స్మార్ట్ అందించనుంది. వచ్చే ఏడాది చివరి నాటికి బీ2బీ విభాగంలో 20 వేల స్కూటర్లను విక్రయించాలని వారివో లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వాహనాలకు అవసరమైన బ్యాటరీ స్వాపింగ్ సేవలను అందించేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని వారివో భావిస్తోంది.

స్పోర్ట్స్

మహిళల వరల్డ్‌కప్‌లో నేడు

న్యూజిలాండ్ X శ్రీలంక	మ. 3.30
బంగ్లాదేశ్ X దక్షిణాఫ్రికా	రా. 7.30

మ్యాచ్ రా. 7 గం.నుంచి స్పోర్ట్స్ 18లో...

టార్గెట్.. క్లీన్‌స్వీప్



ఉప్పల్ మైదానంలో పిచ్‌ని పరిశీలిస్తున్న కెప్టెన్ సూర్యకుమార్

టీమిండియాలో మార్పులు ?

బంగ్లాతో నేడు ఆఖరి టీ20

ఉప్పల్ వేదికగా పోరు



షంటో

హైదరాబాద్: తొలి రెండు టీ20ల్లో ఏకపక్ష విజయాలు సాధించిన భారత్..బంగ్లాదేశ్‌తో ఆఖరి మ్యాచ్‌లోనూ ఆ జోరు కొనసాగించడం ద్వారా సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని భావిస్తోంది. రెండు జట్ల మధ్య మూడో, చివరి మ్యాచ్ శనివారం ఇక్కడ జరగనుంది. మరోవైపు ఈ మ్యాచ్‌లో గెలుపొంది వెటరన్ మహ్మదుల్లాకు విజయంతో వీడ్కోలునివ్వాలని బంగ్లాదేశ్ పట్టుదలగా ఉంది. సిరీస్‌ను టీమిండియా ఇప్పటికే సొంతం చేసుకున్న నేపథ్యంలో రిజర్వ్ ఆటగాళ్లను పరిశీలించే అవకాశముంది. దాంతో లెగ్‌స్పిన్నర్ రవి బిష్ణోయ్, హైదరాబాద్ బ్యాటర్ తిలక్ వర్మ, జితేశ్ శర్మ, హర్షిత్ రాణాల్లో ఒకరిద్దరికి స్థానం దక్కవచ్చు. రెండు మ్యాచ్‌ల్లోనూ ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ అంచనాలను అందుకోలేకపోయారు. మొదటి టీ20లో ఇద్దరూ తక్కువ స్కోర్లకే అవుట్‌కాగా..ఢిల్లీ మ్యాచ్‌లో చక్కటి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. ఇక..తెలుగు ఆటగాడు నితీశ్ కుమార్‌పై మరోసారి అందరి దృష్టి నిలిచింది. రెండో టీ20లో బంగ్లాదేశ్ బౌలర్లను ఎడాపెడా బాదేసిన నితీష్..బౌలింగ్‌లోనూ రాణించి రెండు వికెట్లు పడగొట్టాడు. సుదీర్ఘకాలం తర్వాత జట్టులో చోటు దక్కించుకున్న మిస్టర్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి రెండు మ్యాచ్‌ల్లోనూ సత్తా చాటాడు. స్పీడ్‌స్టర్ మయాంక్ యాదవ్ 150 కి.మీ.లకుపైగా వేగంతో ఆకట్టుకున్నాడు. 38 ఏళ్ల బంగ్లా వెటరన్ ఆటగాడు మహ్మదుల్లా ఆఖరి టీ20 మ్యాచ్ ఆడబోతున్నాడు. ఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ టాపార్డర్ బ్యాటర్లంతా విఫలమైన వేళ..మహ్మదుల్లా (41)నే చెప్పుకోతగ్గ స్కోరు చేయడం గమనార్హం. మరి..విజయంతో అతడికి వీడ్కోలు పలకాలంటే బంగ్లాదేశ్ బ్యాటర్లతోపాటు బౌలర్లు అద్భుతంగా రాణించక తప్పదు.

జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, నితీశ్ కుమార్, రింకూ సింగ్, హార్దిక్, పరాగ్, సుందర్, వరుణ్/బిష్ణోయ్, అర్ష్‌దీప్, మయాంక్ యాదవ్/హర్షిత్.

బంగ్లాదేశ్: షంటో (కెప్టెన్), పర్వేజ్, లిట్టన్ (కీపర్), తౌహిద్, మహ్మదుల్లా, మెహ్దీహసన్, మెహ్దీహసన్ మిరాజ్, రిషద్, టస్కిన్, తన్జిమ్ సకీబ్, ముస్తాఫిజుర్

పిచ్: ఈ పిచ్‌పై 2024 ఐపీఎల్‌లో మూడు జట్లు తొలుత బ్యాటింగ్ చేసి 200లకుపైగా పరుగులు చేసి గెలుపొందాయి. అంటే..పరుగుల వరద ఖాయమన్నమాట.

వాతావరణం..

గత రెండు రోజులుగా హైదరాబాద్‌లో సాయంత్రం వేళ వర్షం కురుస్తోంది. శుక్రవారం కూడా భారీ వర్షం కురవడంతో మైదానాన్ని కవర్లతో కప్పాల్సి వచ్చింది. దాంతో బంగ్లాదేశ్ జట్టు ప్రాక్టీస్‌కు అంతరాయం కలిగింది. శనివారం ఉదయం వర్షం కురిసే అవకాశం 40 శాతం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. అయితే మ్యాచ్ సమయంలో వర్షానికి లేకపోయినా, ఆకాశం మేఘావృతమై ఉంటుందని సమాచారం.



టీమిండియా క్రికెటర్ మహ్మద్ సిరాజ్ డీఎస్పీగా విధుల్లో చేరాడు. శుక్రవారం హైదరాబాద్‌లో డీజీపీ జితేందర్ రెడ్డిని ఆయన కార్యాలయంలోనే మర్యాదపూర్వకంగా కలిసి జాయినింగ్ రిపోర్టును అందించాడు. రాష్ట్ర కేబినెట్ తీర్మానం మేరకు నిబంధనలను సడలించి, ప్రత్యేక జీఓ విడుదల చేసి సిరాజ్‌కు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చారు.



ఆస్ట్రేలియా హ్యాట్రిక్

9 వికెట్లతో పాకిస్థాన్‌పై గెలుపు

మహిళల టీ20 వరల్డ్ కప్

దుబాయ్: డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా టీ20 వరల్డ్ కప్‌లో వరుసగా మూడో విజయంతో హ్యాట్రిక్ కొట్టింది. శుక్రవారం జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో తొమ్మిది వికెట్లతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. తద్వారా గ్రూప్ టాపర్ స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకోవడంతో సెమీఫైనల్ స్థానాన్ని దాదాపు ఖాయం చేసుకుంది. మొదట పాకిస్థాన్ 19.5 ఓవర్లలో 82 పరుగులకే కుప్పకూలింది. అలియా రియాజ్ (26), సిద్రా అమీన్ (12), ఇరామ్ జావెద్ (12) మోస్తరుగా ఆడారు. గార్డెనర్ నాలుగు, సదర్లాండ్, వేరామ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఇక స్వల్ప లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 11 ఓవర్లలో 83/1 స్కోరుతో ఛేదించింది. కెప్టెన్ హీలీ (37 రిటైర్డ్ హర్ట్), ఎలీస్ పెర్రీ (22 నాటౌట్) మెరిశారు. గార్డెనర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. ఆదివారం జరిగే తదుపరి మ్యాచ్‌లో భారత్‌ను ఆస్ట్రేలియా ఢీకొననుంది.

సంక్షిప్తస్కోర్లు: పాకిస్థాన్: 19.5 ఓవర్లలో 82 ఆలౌట్ (అలియా రియాజ్ 26, సిద్రా అమిన్ 12, ఇరామ్ జావెద్ 12, గార్డెనర్ 4/21, సదర్లాండ్ 2/15, వేరామ్ 2/16); **ఆస్ట్రేలియా:** 11 ఓవర్లలో 83/1 (హీలీ 37 రిటైర్డ్ హర్ట్, ఎలీస్ పెర్రీ 22 నాటౌట్, గార్డెనర్ 7 నాటౌట్, సాదియా ఇక్బాల్ 1/17).

ఫైనల్లో అలాస్కన్‌తో త్రివేణి ఢీ

లండన్: గ్లోబల్ చెస్ లీగ్ ఫైనల్లో టేబుల్ టాపర్ పీబీజీ అలాస్కన్ నైట్స్‌తో త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ అమీతుమీ తేల్చుకోనుంది. శుక్రవారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో త్రివేణి 9-7తో ఆల్పైన్ ఎస్‌జీ పైపర్స్‌పై గెలిచింది. ఇతర మ్యాచ్‌ల్లో అలాస్కన్ నైట్స్ 14-5తో అమెరికన్ గ్యాంబిట్స్‌పై, గ్యాంజెస్ గ్రాండ్‌మాస్టర్స్ 12-4తో అప్‌గ్రాడ్ ముంబా మాస్టర్స్‌పై నెగ్గాయి. లీగ్ దశ ముగిసేసరికి అలాస్కన్ 114 పాయింట్లతో టాప్‌లో నిలవగా, త్రివేణి 99 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. శనివారం ఫైనల్ జరగనుంది.

కివీస్‌తో టెస్టులకు రోహిత్ సేన ఇదే..

రిజర్వ్ ఆటగాడిగా నితీశ్



ముంబై: స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరగనున్న మూడు టెస్టుల సిరీస్‌కు భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. రోహిత్ శర్మ సారథ్యంలోని ఈ జట్టుకు బుమ్రాను వైస్‌కెప్టెన్‌గా నియమించారు. ఈనెల 16న బెంగళూరులో జరిగే తొలి టెస్టుతో ఈ సిరీస్ ఆరంభమవనుంది.

జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్),బుమ్రా (వైస్ కెప్టెన్)యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, సర్ఫ్‌రాజ్ ఖాన్, రిషభ్ పంత్ (వికెట్‌కీపర్), ధ్రువ్ జురెల్ (వికెట్‌కీపర్), రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ఆకాష్‌దీప్; **రిజర్వ్ ప్లేయర్లు:** నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, మయాంక్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ

సెమీస్‌లో రష్మిక

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఐటీఎఫ్ మహిళల వరల్డ్ టెన్నిస్ టూర్ మైసూర్ ఓపెన్‌లో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక సెమీఫైనల్లో ప్రవేశించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్స్ పోరులో శ్రీవల్లి 6-2, 6-2తో భారత్‌కే చెందిన ఆకాంక్షపై నెగ్గి టైటిల్‌కు చేరువైంది. అంతకుముందు జరిగిన ప్రీక్వార్టర్స్‌లో రష్మిక 6-1, 6-3తో తనీషా కశ్యప్‌పై గెలుపొందింది.

చెలరేగిన ఆంధ్ర బౌలర్లు

విదర్భ 118 ఆలౌట్



శశికాంత్ (3/31)

నాగ్‌పూర్: ఆంధ్ర పేస్ బౌలర్లు చెలరేగడంతో రంజీ సీజన్ తొలి మ్యాచ్‌లో విదర్భ జట్టు కుప్పకూలింది. సొంతగడ్డపై శుక్రవారం మొదలైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన విదర్భ.. పిచ్‌ని సరిగా అంచనా వేయలేక తొలి ఇన్నింగ్స్‌లో 38.5 ఓవర్లలో కేవలం 118 పరుగులకే ఆలౌటైంది. అక్షయ్ వాడ్కర్ (46 నాటౌట్) మినహా అందరూ విఫలమయ్యారు. ఆంధ్ర పేసర్లు శశికాంత్ (3/31), స్టీఫెన్ (2/43), సత్యనారాయణ రాజు (2/26)తోపాటు స్పిన్నర్ లలిత్ మోహన్ (2/18) అదరగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన ఆంధ్ర జట్టు 33 ఓవర్లలో వికెట్ నష్టానికి 114 పరుగులు చేసింది. అభిషేక్ రెడ్డి (62 నాటౌట్), షేక్ రషీద్ (49 నాటౌట్) క్రీజులో ఉన్నారు. హనుమ విహారి (1) విఫలమయ్యాడు.

పాక్‌కు ఘోర పరాభవం

ఇన్నింగ్స్ తేడాతో ఇంగ్లండ్ విజయం



జాక్ లీచ్ (4/30)

ముల్తాన్: టెస్టు క్రికెట్ చరిత్రలోనే ఘోర పరాజయాన్ని పాకిస్థాన్ జట్టు మూటగట్టుకుంది. శుక్రవారం ముగిసిన తొలి టెస్టులో ఇంగ్లండ్ జట్టు ఇన్నింగ్స్ 47 పరుగుల తేడాతో భారీ విజయాన్ని అందుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 152/6తో ఆఖరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్థాన్ 220 పరుగులకు ఆలౌటైంది. 11వ నెంబర్ ఆటగాడు అబ్రార్ అహ్మద్ జ్వరం కారణంగా బ్యాటింగ్‌కు దిగలేదు. సల్మాన్ ఆగా (63), ఆమెర్ జమాల్ (55 నాటౌట్) రాణించారు. ఐదోరోజు పతనమైన మూడు వికెట్లనూ జాక్ లీచ్ సాధించాడు. మొత్తంగా లీచ్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. కాగా 147 సంవత్సరాల టెస్ట్ క్రికెట్ చరిత్రలో మొదటి ఇన్నింగ్స్‌లో 500కుపైగా పరుగులు సాధించి..ఇన్నింగ్స్ తేడాతో ఓటమిపాలైన తొలి జట్టుగా పాక్ అపఖ్యాతిని మూటగట్టుకుంది. మొదటి ఇన్నింగ్స్‌లో పాక్ 556, ఇంగ్లండ్ 7 వికెట్లకు 823 (డిక్లేర్డ్) పరుగులు చేశాయి. కాగా 2021 ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకూ పాకిస్థాన్ జట్టుకు సొంతగడ్డపై విజయం దక్కలేదు. అప్పటినుంచి 11 టెస్టులాడి ఏడు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది.

దేవర 2లో రణ్‌బీర్, రణ్‌వీర్?



ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన 'దేవర' చిత్రం ఇటీవలే విడుదలై పాన్ ఇండియా స్థాయిలో ఘన విజయం అందుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ చిత్రానికి కొనసాగింపుగా రాబోతున్న 'దేవర 2' చిత్రం గురించి పలు ఆసక్తికర విషయాలను కొరటాల శివ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. 'దేవర' చిత్రంలో విలన్ పాత్రలో బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్, కథానాయికగా జాన్వీకపూర్ నటించారు. వీరితో పాటు రెండో భాగంలో మరికొందరు బాలీవుడ్ తారలు భాగమవనున్నారని ఆయన చెప్పారు. 'దేవర 2'లో కొన్ని అతిథి పాత్రలు ఉన్నాయి. అవి కథలో చాలా కీలకంగా ఉంటాయి. రణ్‌వీర్‌సింగ్, రణ్‌బీర్‌కపూర్ లాంటి బాలీవుడ్ స్టార్స్ ఆ పాత్రల్లో నటిస్తే బాగుంటుందని నాకు అనిపిస్తోంది. ఇది నా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. జరుగుతుందో లేదో తెలియదు కాబట్టి ఇప్పుడే దీని గురించి నేను ఎక్కువ మాట్లాడ కూడదు. కొంతమంది తెలుగు, తమిళ హీరోలు అయినా ఆ పాత్రలు పోషిస్తే బావుంటుంది. వారి పేర్లు చెబితే ఇప్పటి నుంచే ఊహాగానాలు మొదలవుతాయి కాబట్టి చెప్పడం లేదు. త్వరలోనే వివరాలు ప్రకటిస్తాం' అన్నారు.



వశిష్ట దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' సెట్స్‌లో సందడి నెలకొంది. శుక్రవారం వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి ఈ మూవీ సెట్స్‌కు వచ్చారు. ఈ సందర్భంగా చిరంజీవితో కలసి వెంకటేశ్, అనిల్ రావిపూడి, మీనాక్షీ చౌదరి, ఐశ్వర్య రాజేశ్ దిగిన ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి.

రాజకీయాల్లోకి సాయాజీ షిండే



వెండితెరపై విలన్, కమెడియన్ పాత్రల్లో నటించి తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన మరాఠా నటుడు సాయాజీషిండే రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. శుక్రవారం ఆయన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్‌పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ (నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ)లో చేరారు. అజిత్‌పవార్ స్వయంగా కండువా కప్పి సాయాజీ షిండేను పార్టీలోకి ఆహ్వానించారు. అజిత్‌పవార్ పనితీరు నచ్చి ఎన్సీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు షిండే తెలిపారు. త్వరలో మహారాష్ట్రలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్సీపీ తరపున ప్రచారం చేయడంతో పాటు సాయాజీ షిండే ఎమ్మెల్యేగా బరిలో నిలవనున్నారని సమాచారం.

రేసర్‌గా నిఖిల్



సుధీర్ వర్మ దర్శకత్వంలో నిఖిల్ సిద్ధార్థ్, రుక్మిణీ వసంత్ జంటగా నటిస్తున్న చిత్రం 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'. బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో నిఖిల్ రిషి అనే పాత్రలో రేసర్‌గా కనిపించనున్నారు. నవంబర్ 8న సినిమా విడుదల కానుంది. హర్ష చెముడు, దివ్యాంశ కౌశిక్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎడిటర్: నవీన్ నూలి, సినిమాటోగ్రఫీ: రిచర్డ్ ప్రసాద్.

మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నా



బాలీవుడ్ హీరోయిన్ అలియాభట్‌ను కథానాయిక రష్మిక మందన్న పొగడ్తలతో ముంచెత్తారు. శుక్రవారం అలియా నటించిన 'జిగ్రా' చిత్రం విడుదలైంది. ప్రత్యేక ప్రదర్శనకు రష్మిక హాజరయ్యారు. ఈ నేపథ్యంలో అలియా కథల ఎంపిక అద్భుతంగా ఉందని ఇన్‌స్టాగ్రామ్‌లో రష్మిక మెచ్చుకున్నారు. 'అలియా నువ్వు మాకు దొరకడం ఓ వరం. నటిగా నీలోని ప్రతిభను మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నాను. విభిన్నమైన కథలతో ప్రేక్షకులను అలరిస్తున్నందుకు ధన్యవాదాలు. ఇలానే మరెన్నో గొప్ప చిత్రాల్లో ప్రేక్షకులను అలరించాలి' అని ఆకాంక్షించారు.

గొప్ప చిత్రాల్లో ఒకటిగా నిలుస్తుంది



మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ నటించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. మీనాక్షీ చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. ఈ నెల 31 సినిమా విడుదలవుతోంది. శుక్రవారం ఈ చిత్ర దర్శకుడు, నిర్మాత మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ "త్వరలోనే సినిమా ట్రైలర్‌ను విడుదల చేయనున్నాం. సినిమా అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది. ఈ మధ్య కాలంలో తెరకెక్కిన గొప్ప చిత్రాలలో ఇది ఒకటిగా నిలుస్తుంది. విజయంపై పూర్తి ధీమాతో ఉన్నాం" అని చెప్పారు. "ఇది 1980-90ల కాలంలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనలను ఆధారంగా చేసుకుని రాసుకున్న కల్పిత కథ. ఇప్పటిదాకా నేను తీసిన సినిమాల్లో ఇది ప్రత్యేక చిత్రంగా నిలుస్తుంది. సినిమా సాంకేతికంగా ఉన్నతంగా ఉంటుంది" అని దర్శకుడు వెంకీ అట్లూరి చెప్పారు.

Printed and published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 208/5A, Diwancheruvu to Velugubanda Road, Palacharla (V), Rajanagaram Mandal, Rajamahendravaram - 533 102, Editor : K. Srinivas, RNI No. APTEL/2004/11740, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N.Prasad.

కాకినాడ

• పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

రామవరంలో అన్న సంతర్పణ

జగ్గంపేట, అక్టోబరు 11: జగ్గంపేట మండలం రామవరం గ్రామంలో కనకదుర్గ ఆలయం వద్ద అన్న సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమానికి జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. రామవరం ఎంపీటీసీ దొడ్డ శ్రీను, మొగిలి గంగాధర్, మండపాక బాపన్నదొర, వేణుగోపాల్, గోకేడ ప్రసాద్, కాయల మణికంఠ, రేపూరి శ్రీనివాస్, బచ్చల రాజు, గోకేడ రమణ, కొలిమల్ల అధియ్యా, బుజ్జి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వంతాడ లేటరైట్ యార్డును పరిశీలించిన ఆర్డీవో

ప్రత్తిపాడు, అక్టోబరు 11: మండలంలో వంతాడ లేటరైట్ యార్డును శుక్రవారం పెద్దాపురం ఆర్డీవో శ్రీ రమణి పరిశీలించారు. తహశీల్దార్ ఎం.సూర్యప్రభతో కలిసి ఆమె లేటరైట్ నిల్వలు, యార్డు రికార్డులను పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న ప్రత్తిపాడు తహశీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించి పలు అంశాలపై సమీక్షించారు.

సత్యదేవ మాలదీక్షపై ప్రచారం

ప్రత్తిపాడు, అక్టోబరు 11: ప్రత్తిపాడులో శుక్రవారం సత్యదేవ మాల దీక్షపై ప్రచారం నిర్వహించారు. సత్యదీక్ష ప్రచార కర్త నల్లమిల్లి కృష్ణబాబు భక్తులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ నెల 27న ఆదివారం సత్యదీక్షలు ప్రారంభమవుతాయని, 27 రోజుల పాటు దీక్షలు కొనసాగి సత్యదేవుని కొండకు చేరుకుని వ్రతం ఆచరించడం ద్వారాదీక్షలు ముగుస్తాయని తెలిపారు. స్థానిక మున్సిబ్ వారి రామాలయం వద్ద కరపత్రాలు, పోస్టర్లను అన్నవరం సత్యదేవ పాలకమండలి మాజీ సభ్యుడు సింగిలిదేవ్ సత్తిరాజు పంపిణీ చేశారు. గురుభవాని నామసాని రామకృష్ణ, మదినే బాబ్జి, సూర్యకుమారి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం : ఎమ్మెల్యే



ప్రత్తిపాడులో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, అక్టోబరు 11: ఆధ్యాత్మిక చింతన ప్రతి ఒక్కరికీ అవసరమని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. శుక్రవారం స్థానిక చెక్‌పోస్టు సెంటర్‌లోని కనకదుర్గ ఆలయాన్ని సందర్శించి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొని వడ్డించారు. ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు. రౌతుపాలెం గ్రామంలో బోనాల పండుగ నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు పాల్గొని ప్రసాద వడ్డన చేశారు. వరుపుల సాయికిరణ్, పెదిరెడ్ల రాజీవ్, దాసరి రాంబాబు, గుండం సత్తిబాబు, ఉపసర్పంచ్ కె.బాబ్జి, నాని, గణేశుల దొరబాబు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు

ఏలేశ్వరం, అక్టోబరు 11: భద్రవరం గ్రామంలో దేవి నవరాత్రి ఉత్సవాల్లో శుక్రవారం మహిళలు బోనాలు పండుగ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి చేశారు. పలు వీధుల్లో బోనాలతో మహిళలు ఊరేంపు నిర్వహించి దుర్గమ్మకు మొక్కులు చెల్లించి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జిగటాపు సూరిబాబు, కొప్పుల బాబ్జి ఉన్నారు.

'ఉప్పలపాడు పంచాయతీ నిధుల అవకతవకలపై చర్యలు తీసుకోండి'

గండేపల్లి, అక్టోబరు 11: మండలంలో ఉప్పలపాడు గ్రామ పంచాయతీ నిధుల అవకతవకలపై చర్యలు తీసుకోవాలని జనసేన, టీడీపీ నాయకులు కోరారు. దీనిపై శుక్రవారం ఉప్పలపాడులో జనసేన నేతలు మేడిబోయిన శ్రీను, సత్తి సోమరాజు విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ హయాంలో గెలిచిన ఉప్పలపాడు పంచాయతీ సర్పంచ్ గ్రామంలో ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారన్నారు. ముఖ్యంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మించి దాన్ని పశువుల పాకగా ఉపయోగిస్తున్నారన్నారు. గ్రామ పంచాయతీ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి సంబంధించి రూ.18లక్షలు, ఉపాధి హామీలో పనుల్లో రూ.10లక్షలు, జలజీవన్ మిషన్ పేరిట కుళాయి కనెక్షన్ల ద్వారా రూ.64లక్షలు నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపించారు. బిల్లులు పెట్టుకుని ప్రభుత్వ సొమ్ము స్వాహా చేశారని గ్రామంలో ఏ అభివృద్ధి చేయలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి దుర్వినియోగమైన నిధులు రికవరీ చేసి దీనికి కారకులైన సర్పంచ్, వారికి సాయపడిన క్షేత్రస్థాయి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకుడు అడబాల సత్యనారాయణమూర్తి, జిల్లా మాలమహానాడు సెక్రటరీ నూకతట్టు రమణ, వార్డు మెంబర్లు తలాటం సూరిబాబు, కక్కల రాజు, అంకం ఓంకృష్ణ, దూది శ్రీను ఉన్నారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

ప్రత్తిపాడు, అక్టోబరు 11: లంపకలోవలోని వీరభద్ర ఎక్స్‌పోర్ట్స్ రొయ్యల పరిశ్రమ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన నిరసన రెండో శుక్రవారం కూడా కొనసాగింది. కార్మికుల ఆందోళనకు సీఐటీయూ నాయకులు రొంగల ఈశ్వరరావు మద్దతు తెలిపి వారి న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

బ్యాగులో బంగారు వస్తువులు మిస్సింగ్‌పై పోలీసులకు ఫిర్యాదు

గండేపల్లి, అక్టోబరు 11: బ్యాగులో ఉంచిన బంగారు వస్తువులు కనిపించకపోవడంతో శుక్రవారం గండేపల్లి పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్ఐ యువి శివనాగబాబు వివరాల ప్రకారం.. విశాఖపట్నానికి చెందిన మొల్లేటి సుగుణ తన ఇద్దరు పిల్లలతో కలిసి ఏలేశ్వరం తన అక్క ఇంటి నుంచి యర్రవరం వచ్చి సెంటర్‌లో ఆటో ఎక్కింది. అక్కడి నుంచి ఆమె పుట్టిల్లు మురారి గ్రామం వచ్చి ఇంటికివెళ్లారు. సాయంత్రం ఆమెతో పాటు తెచ్చుకున్న బ్యాగు తెరిచి చూడగా బంగారపు పాపిడిబొట్టు, హారం, నక్లెస్ పెట్టిన బాక్సు కనిపించలేదు. ఎంత వెతికిన దొరకపోవడంతో గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ కేసు నమోదు చేశారు.

సోమాలమ్మకు ప్రత్యేక పూజలు

జగ్గంపేట, అక్టోబరు 11: స్థానిక రాజమండ్రి రోడ్‌లో సోమాలమ్మ అమ్మవారి ఆలయంలో ఓ రుచి హోటల్స్ అధినేత నాగేంద్ర చౌదరి సత్యభారతి దంపతులు శుక్రవారం అమ్మవారికి పంచామృత అభిషేకం హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు మహిషాసురమర్దిని అవతారంలో దర్శనమిచ్చారు. గత పదిరోజులగా భవానీలు, అయ్యప్ప భక్తులు నడిచి వెళ్లే వారందరికీ మోహన్‌కృష్ణా రెసిడెన్సిలో ఉచిత వసతి భోజనం ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు నాగేంద్ర చౌదరి కుటుంబ సభ్యులు నవదీప్ వెంకట సాయి, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు. అలాగే జగ్గంపేట దేవీ సెంటర్లో వెలిసినలలితా భువనేశ్వరి దేవి అమ్మవారు దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం 9వరోజు మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు. అమ్మవారి అలంకరణకు పెండెం జయరాం, వరలక్ష్మి దంపతులు చీరను బహుకరించారు. ఆలయ అర్చకులు మామిళ్ళపల్లి అయ్యప్ప అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు.

మల్లేపల్లిలో కుంకుమ పూజలు

గండేపల్లి, అక్టోబరు 11: మల్లేపల్లి జాతీయ రహదారి పక్కన ఇనకోటి వెంకటేశ్వరరావు స్థలంలో నూతనంగా నిర్మించిన శ్రీవిజయకనకదుర్గ ఆలయం వద్ద శుక్రవారం పురోహితులు చింతా అరుణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దొమ్మా శ్రీను, వెలిది సుబ్రహ్మణ్యం, అడబాల గంగారావు, పడాల శ్రీను, ఉండమంట్ల వెంకటేశ్వరరావు, శ్రీను, త్రిమూర్తులు, ఇనకోటి భాస్కరరావు, నరవ శ్రీను, వెలిది వెంకటరాజు, వెలిదీ చిన్ని, ప్రసన్న ఉన్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank | **ఎఆర్ఎమ్ బ్రాంచ్ (13591)**
మెలోడీ సినిమా థియేటర్ ఎదురుగా, సూర్యాభాగ్, విశాఖపట్నం

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

టు:
ఋణగ్రహీతలు: (1) శ్రీమతి తోటకూర విజయ కాంతి, భర్త: టి. శ్రీనుబాబు, డి.నెం.3-24/B, భువనేశ్వరి గుడి వీధి, కొప్పవరం గ్రామం, తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-533016. (2) శ్రీ తోటకూర శ్రీనుబాబు, తండ్రి: టి. దేవేంద్రరావు, డి.నెం.3-24/B, భువనేశ్వరి గుడి వీధి, కొప్పవరం గ్రామం, తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-533016. (3) శ్రీమతి మగపు పద్మావతి, భర్త: ఎం. వెంకటరమణ (లేటు), (4) శ్రీ మగపు శివాజీ, తండ్రి: ఎం. వెంకటరమణ (లేటు), నివాసం డి.నెం. 3-105, సాయిబాబా గుడి వీధి, కాకినాడ రూరల్ రేపూరు, ఇంద్రపాలెం, తూర్పుగోదావరి-533006. (మరణించిన ఋణగ్రహీత శ్రీ ఎం. వెంకటరమణ అలియాస్ వెంకన్న గారి చట్టబద్ధమైన వారసులుగా). హామీదారు: (5) శ్రీ కొండల సత్యనారాయణ, తండ్రి: కె. కొండలరావు, ఆర్/ఒ. 2-180, శివాలయం వీధి, తొండంగి, కాకినాడ, తూర్పుగోదావరి, ఆంధ్రప్రదేశ్-533408.
డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.

మా కెనరా బ్యాంక్ నుండి శ్రీమతి తోటకూర విజయకాంతి, శ్రీ తోటకూర శ్రీనుబాబు, శ్రీ ఎం. వెంకటరమణ పొందిన లోన్స్ / ఋణ సౌకర్యాల వివరములు:

లిమిట్	లోన్ మొత్తం	తేది 23.09.2024 నాటికి బకాయి మొత్తం	వడ్డీ రేటు
ఫండ్ బేస్డ్	రూ.36,00,000/-	రూ. 89,81,530.15	11.70%

... బ్యాంక్ సదరు ఋణాన్ని తేది 02.05.2017 వ నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది. ... అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా రూ.89,81,530.15 (అక్షరాల ఎనభై తొమ్మిది లక్షల ఎనభై ఒక్క వేల ఐదు వందల ముప్పై రూపాయలు మరియు పదిహేను పైసలు) + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. ... సెక్షన్ 13(4) క్రింద ... SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము ... డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

ఐటమ్ నెం-1: తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ సబ్ రిజిస్ట్రీ, కాకినాడ రూరల్ మండలం, రేపూరు పంచాయితీ మరియు గ్రామం, ఎస్.నెం.3/18, మొత్తం ఎ.1.90 సెంట్లులో ఎ.0.40 సెంట్లులో ఎ.0.15 సెంట్లులో 145.34 చ॥గ॥. ఖాళీ స్థలం. అసెస్‌మెంట్ నెం.402, డి.నెం.3-105. హద్దులు: తూర్పు: 32.6 అ॥ లేదా 09.90 మీ॥ ... పడమర: 32.6 అ॥ లేదా 09.90 మీ॥ షేక్ మీరాసాహెబ్ ఆస్తి, ఉత్తరం: 40.6 అ॥ లేదా 12.34 మీ॥ మగపు ఆదినారాయణ ఆస్తి, దక్షిణం: 40.00 అ॥ లేదా 12.19 మీ॥ పంచాయితీ రోడ్డు.

ఐటమ్ నెం-2: తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ సబ్ రిజిస్ట్రీ, కాకినాడ రూరల్ మండలం, రేపూరు పంచాయితీ మరియు గ్రామం, ఎస్.నెం.3/18, మొత్తం ఎ.1.90 సెంట్లులో ఎ.0.40 సెంట్లు అందులో ఎ.0.15 సెంట్లులో మిగతా విస్తీర్ణం 470.93 చ॥గ॥ ఖాళీ స్థలము అసెస్‌మెంట్ నెం.402, డి.నెం.3-105, హద్దులు: తూర్పు: 107.9 అ॥ లేదా 32.84 మీ॥ ... పడమర: 107.9 అ॥ లేదా 32.84 మీ॥ షేక్ మీరాసాహెబ్ ఆస్తి, ఉత్తరం: 037.6 అ॥ లేదా 11.43 మీ॥ షేక్ రాజా ఆస్తి, దక్షిణం: 41.2 అ॥ లేదా 12.54 మీ॥ మగపు వెంకటరమణ ఆస్తి. పైన తెలిపిన ఐటెం 1 మరియు ఐటెం2 కలిపి మొత్తం విస్తీర్ణం 616.27 చ॥గ॥ల ఖాళీ స్థలము ...

తేది:11.10.2024, ప్రదేశం: విశాఖపట్నం | సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కాకినాడ

• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

వనదుర్గ ఆలయంలో చండీహోమం


హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

అన్నవరం, అక్టోబరు 11: వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతి పూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ హరిబాబు, సూపరెంటెండెంట్ ఐవీ రామారావు పాల్గొన్నారు.

నేడు రావణదహనం

విజయదశమి సందర్భంగా శనివారం రాత్రి 8గంటలకు రావణదహనం కార్యక్రమం కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్టు అధికారులు వెల్లడించారు. అన్నవరం పరిసరప్రాంత వాసులు ప్రత్యక్షంగా వీక్షించేందుకు రావాలని కోరారు.

విజయవాడకు భవానీ భక్తుల పయనం

ప్రత్తిపాడు, అక్టోబరు 11: మండలంలోని భవానీ మాలధారణ భక్తులు శుక్రవారం మొక్కులు చెల్లించుకునేందుకు విజయవాడ బయల్దేరారు. ధర్మవరం, ప్రత్తిపాడు, ఉత్తరకంచి, ఒమ్మంగి ఆలయాల వద్ద భక్తులు మండల దీక్షలు ముగించుకుని పలు వాహనాల్లో విజయవాడ కనకదుర్గ అమ్మవారి మొక్కులు తీర్చుకునేందుకు బయల్దేరారు. ఉత్తరకంచి ఆల యం మహిషాసురమర్దిని అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని 130 మంది భవానీలు దర్శించుకున్నారు.

కృష్ణుడి గుడికి మైక్ సెట్ బహూకరణ

జగ్గంపేట, అక్టోబరు 11: కాకినాడ రోడ్‌లోని కృష్ణుడు గుడికి రూ.20వేలు విలువ గల మైక్ సెట్‌ను బొబ్బిలి జ్ఞాపకార్థం వారి మనవళ్లు బహూకరించారు. కార్యక్రమంలో శ్రీ కృష్ణయాదవ సంఘం అధ్యక్షుడు మోరుకుర్తి రాజు యాదవ్, మాజీ అధ్యక్షుడు వైభోగుల కొండబాబు యాదవ్ ఉన్నారు.

వైస్ ఎంపీపీకి పితృవియోగం

ప్రత్తిపాడు, అక్టోబరు 11: ప్రత్తిపాడు మండల పరిషత్ వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను తండ్రి ఏనుగు వీర రాఘవులు (60)అనారోగ్యానికి గురై శుక్రవారం రాచపల్లిలోని తమ స్వగృహం వద్ద కన్నుమూశారు.

మహిషాసుర మర్దినిగా కన్యకాపరమేశ్వరి

కిర్లంపూడి, అక్టోబరు 11: కిర్లంపూడిలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మ వారు శుక్రవారం మహిషాసుర మర్దినిదేవిగా దర్శనమివ్వగా భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

జ్యోతుల ఫౌండేషన్ పెళ్లి కానుక అందజేత

జగ్గంపేట, అక్టోబరు 11: పేద కుటుంబాల్లో ఆడబిడ్డలకు వివాహం జరిపించే సమయంలో తల్లిదండ్రులకు ఆసరాగా ఉండాలని లక్ష్యంతో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా రూ.20వేలు ఆర్థిక సాయం చేయడం ఆనందంగా ఉందని జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ చైర్మన్ జ్యోతుల మణి అన్నారు. మండలంలోని మామిడాడ గ్రామంలో మడికి ఎలిసమ్మ కుమార్తె చిన్నాలు, వీధి చంటిబాబు వివాహ వేడుకకు జ్యోతుల మణి హాజరై నూతన దంపతులకు రూ.20 వేల చెక్కును అందించారు. పెళ్లికి 9 రోజుల ముందు తమ ఫౌండేషన్ కార్యాలయంలో వివరాలు నమోదు చేసుకుని తెలియజేస్తే నవ వధువుకు రూ.20వేలు సాయం అందిస్తామన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రూ. 20వేలు అందజేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ జ్యోతుల మణి

ఏవి నగరంలో వైభవంగా లక్ష కుంకుమార్చన

పాల్గొన్న ఎమ్మెల్యే దివ్య, మాజీ మంత్రి యనమల

తొండంగి, అక్టోబరు 11: శరన్నవరాత్రుల్లో తొమ్మిదవ రోజైన శుక్రవారం ఏవినగరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్ధినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో వందలాది భవానీలు, మహిళా భక్తులతో అర్చక స్వాములు అమ్మవారికి లక్ష కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. యనమల ఫౌండేషన్ తరఫున భక్తులకు పూజా ద్రవ్యాలను ఉచితంగా అందించారు. తుని ఎమ్మెల్యే యనమల దివ్య, ఆర్థిక మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు సతీమణి విజయలక్ష్మి కుంకుమ పూజలో పాల్గొన్నారు. అంతకుముందు వేదికపై ప్రతిష్ఠించిన దేవతామూర్తులకు అర్చక స్వాములు విశేషపూజలు నిర్వహించారు. యనమల రామకృష్ణుడు కల్యాణ వేంకటేశ్వరుని దర్శించుకున్నారు. భక్తులందరికి ఆలయ కమిటీ అన్న ప్రసాదం అందించారు. కార్యక్రమంలో యనమల నాగేశ్వరరావు, టీడీపీ బీసీ సెల్ కార్యదర్శి కొయ్యా రామకేశవ, కొయ్యా సూరిబాబు, యనమల మురళీకృష్ణ, కొంగర విశాలాక్షి, అరిగెల నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.


వేంకటేశ్వరుని దర్శించుకుంటున్న మాజీ మంత్రి యనమల

'లోవ'లో సామూహిక కుంకుమార్చనలు


ఆలయంలో భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ అమ్మవారు, సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

తుని రూరల్, అక్టోబరు 11: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం మహిషాసుర మర్ధినిదేవిగా తలుపులమ్మవారు భక్తులను అనుగ్రహించారు. ఆలయంలో ఉచిత సామూహిక కుంకుమార్చనలు నిర్వహించగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజలాచరించారు. ఆలయ పండితుల పర్యవేక్షణలో భక్తులకు ఉచితంగా పూజా సామాగ్రి అందజేసి కుంకుమార్చన చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేసినట్టు ఆలయ ఈవో విశ్వనాథ రాజు తెలిపారు.

మహిషాసుర మర్దినిగా రత్నగిరి దుర్గలు

అన్నవరం, అక్టోబరు 11: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రత్నగిరి దుర్గలుగా పూజలందుకుంటున్న వనదుర్గ, కనకదుర్గలు మహిషాసుర మర్దినిగా భక్తులను అనుగ్రహించారు. దుష్టశిక్షణార్థం అవతరించిన అమ్మగా దర్శనమివ్వగా అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించారు.


మహిషాసుర మర్దినిగా వనదుర్గమ్మ

కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

జగ్గంపేట, అక్టోబరు 11: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా గోకవరంలోని దేవీచౌక్, గద్దెలోని కనకదుర్గ అమ్మవారిని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మహిషాసుర మర్ధినిగా అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాలు, పూలమాలతో సత్కరించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు

ఐదుగురికి గాయాలు

గండేపల్లి, అక్టోబరు 11: మండలంలో మురారి గ్రామ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. పోలీసుల సమాచారం ప్రకారం.. భీమవరం నుంచి అన్నవరం ఆటోలో వెళ్లి తిరిగి వస్తుండగా మురారి వచ్చేసరికి అదేమార్గంలో వైజాగ్ వైపు నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న కారు ఆటోను బలంగా ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ ఎం.వీరబాబు, సత్యవతికి బలమైన గాయాలు కాగా జయలక్ష్మి, మరిడమ్మ, హారికకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్‌ఐ శివనాగబాబు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.


ప్రమాదంలో నుజ్జునుజ్జైన ఆటో, క్షతగాత్రులకు ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

